Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 110 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 మే 2023 శుక్రవారం పేజీలు : 4

## జూలై 1న జగన్నాథ రథయాత్ర

జూలై 1వ తేదీ శుక్రవారం నుంచి ఒరిస్సాలో జగన్నాథుని రథయాత్ర ప్రారంభం కానుంది. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవం ఆషాఢ మాసం, శుక్ల పక్షం రెండవ రోజు నుంచి ప్రారంభమవుతుంది. రథయాత్రలో జగన్నాథుడు, బలభద్రుడు, సోదరి సుభద్ర మూడు వేర్వేరు రథాలపై ఊరేగుతారు. ఆషాఢ శుక్ల దశమి నాడు, ఈ మూడు రథాలు తిరిగి ప్రధాన ఆలయం దగ్గరకు చేరుకుంటాయి. ఈ రథయాత్రలో ఉపయోగించే రథాలు చాలా ప్రత్యేకమైన రీతిలో రూపొందించారు. రథం తయారీలో ఎలాంటి లోహాన్ని వినియోగించరు. ఈ మూడు రథాలను పవిత్రమైన చెక్కతో తయారు చేస్తారు. రథాల తయారీకి శుభప్రదమైన చెట్లను వినియోగిస్తారు. వసంత పంచమి నుండి రథాలకు సంబంధించిన కలప ఎంపిక జరుగుతుంది. కలపను సేకరించాక అక్షయ తృతీయ నుండి రథాల తయారీ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

# యువత ఎటుంటే ఆటే అధికారం



## తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన 'యూత్'

హైదరాబాద్: బీయారెస్ రెండు సార్లు అధికారంలో ఉంది. దాదాపుగా తొమ్మిదిన్నరేళ్ళ పాటు పీఠాన్ని అనుభవించి ఈ డిసెంబర్ లో బీయారెస్ ఎన్నికలకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో బీయారెస్ హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. ఈసారి కనుక గెలిస్తే ఇక తిరుగు ఉండదన్నది బీయారెస్ ప్లాన్. అయితే బీయారెస్ అనుకూలంగా పరిస్థితులు ఏంటి అంటే విపక్షం రెండుగా చీలిపోవడం. అదే సమయంలో ప్రతికూల పరిస్థితి అంటే ప్రభుత్వం మీద పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉండడం. ఈ రెండింటిలోను బ్యాలన్స్ చేస్తూ బీయారెస్ ని ఢీ కొట్టి అధికారంలోకి ఏ రాజకీయం పక్షం వస్తుంది అన్నదే చూడాలి. తెలంగాణాలో ఈసారి అన్ని రాజకీయ పార్టీలు యూత్ ఓటర్లనే టార్గెట్ చేశాయి. కొత్త పార్టీలతో పాటు కాంగ్రెస్ బీజేపీ కూడా యూత్ ఓట్లను కొల్లగొట్టేందుకు పక్క ప్లాన్ తో ముందుకు సాగుతున్నాయి. తెలంగాణా రావడానికి యూత్ అవేశం కారణం. బీయారెస్ ని రెండు సార్లు నెగ్గించడానికి ఊడా ఆదే యువత ఫైర్ కారణం. ఇపుడు ఆ యువత ఆలోచనలు మారుతున్నాయి. నీరు నిధులు నియామకాలలో నీరు సంగతి నిధుల సంగతిని పక్కన పెడితే నియామకాల విషయంలో బీయారెస్ హామీ నెరవేర్చడంతో వెనకబడింది అన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఖాళీలు దాదాపుగా రెండు లక్షలకు పైగా ఉన్నాయని ఒక లెక్క ఉంది. కానీ బీయారెస్ ప్రభుత్వం మాత్రం నియామకాలను పెద్ద ఎత్తున తీయడం లేదు అన్న తీవ్ర అసంతృప్తి యూత్ లో ఉంది. అంతే కాదు టీపీసీసీ పేపర్ లీక్ ఇష్యూ పెద్ద ఎత్తున దావానలంగా వ్యాపించి ప్రభుత్వ ప్రతిష్టను దిగజారిచింది. ఇలాంటి స్కాం ల వల్ల యువతకు అసలైన వారికి కొలువులు రావడం లేదు అన్న బాధ అయితే వారిలో ఉంది. మరో వైపు చూస్తే యూత్ పూర్తిగా విసిగిపోయి ఉంది. తమకు ఉపాధి లేదని మధన పడుతోంది. బీయారెస్ 2018లో నియామకాలు పెద్ద ఎత్తున చేస్తామని చెప్పడంతో పాటు నిరుద్యోగ భృతిని ఇస్తామని తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొంది. ఒక్కో నిరుద్యోగికి అక్షరాలా మూడు వేల పదహారు రూపాయలు ఇస్తామని కూడా పేర్కొంది. ఇప్పటికి అయిదేళ్ళకు దగ్గర పడుతోంది కానీ ఆ హామీని నెరవేర్చలేదు. అదే టైం లో ప్రభుత్వ కొలువులు పెద్దగా తీయలేదు. అయితే ప్రైవేట్ ఉద్యోగాలు పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఇప్పించామని బీయారెస్ నేతలు చెబుతున్నారు. కానీ యువత ఆశగా ఎదురు చూసేది సర్కారీ కొలువులనే కబట్టి వారు ఆగ్రహంగానే ఉన్నారని అంటున్నారు. దాంతో ఈసారి కాంగ్రెస్ బీజేపీ యూత్ మీదనే గురి పెట్టి తమ రాజకీయానికి పదును పెడుతున్నారు. ప్రియాంకా గాంధీ యువ సంఘర్షణ సభలో నిరుద్యోగ యువతకు నెలకు నాలుగు వేల రూపాయలను భృతిగా ఇస్తామని పేర్కొన్నారు. అదే విధంగా తాము అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని మరో హామీ ఇచ్చారు. ఇక బీజేపీ కూడా యువతకు భారీ హామీలు ఇస్తోంది. జాబ్ క్యాలండర్ ని అమలు చేస్తామని యూపీఈస్సీ తరహాలో టీపీఎస్సీని ప్రక్షాళన చేసి యువతకు ఉద్యోగాలు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని బండి సంజయ్ ప్రకటించారు. మొత్తం మీద చూసుకుంటే యూత్ ఓటింగ్ ఈసారి టర్న్ అవుతుందని అది బీయారెస్ కి యాంటీగా మారి తమను గెలిపిస్తుందని కాంగ్రెస్ బీజేపీ భావిస్తున్నాయి. బీయారెస్ నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం ప్రభుత్వ నియామకాలు పెద్దగా చేపట్టకపోవడం అనే మైనస్ పాయింట్ ని పట్టుకుని విపక్షాలు రాజకీయ సమరం సాగిస్తున్నాయి. మరి యూత్ ఈసారి ఎటు వైపు ఉంటారో వారిదే విజయం అని అంటున్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వద్ద సెట్విన్ మినీ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులు గోల్కొండ, చార్మినార్, సికింద్రాబాద్, మెహదీపట్నం మార్గాల్లో సేవలందించనున్నాయి.

## సీన్లోకి రానున్న 'టీఆర్ఎస్' పార్టీ.. భారీ ప్లాన్ వేసిన పొంగులేటి!

హైదరాబాద్ : పోయిన చోటే వెతుక్కోవాలన్న సామెతను తూచా తప్పకుండా పాటించేలా ప్లాన్ చేస్తున్నారు బీఆర్ఎస్ మాజీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి. తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి తెర మీదకు తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ (పొట్టిగా పలికితే ఈ పేరు.. వివరంగా చూస్తే తెలంగాణ రాష్ట్ర సమితి) ను మార్చి బీఆర్ఎస్ గా మార్చటం తెలిసిందే. ఈ మధ్యనే బీఆర్ఎస్ నుంచి వేటు పడి బయటకు వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కేసీఆర్ బాధితులుగా మారిన నేతల్ని ఒక వేదిక మీదకు తీసుకురావటం.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి.. తర్వాతి కాలంలో అడ్రస్ లేకుండా చేసిన కేసీఆర్ బాధితుల్ని కలిపేందుకు వీలుగా టీఆర్ఎస్ (తెలంగాణ రైతు సమాఖ్య) పేరుతో కొత్త వేదికను సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ వద్ద ఒక రాజకీయ పార్టీ నమోదైంది కూడా. దీన్ని పొంగులేటి అనుచరులే రిజిస్టర్ చేయించినట్లు చెబుతున్నారు. ఈ పార్టీని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటికి తెర మీదకు తీసుకొచ్చి.. దాదాపు 45 స్థానాల్లో తన అనుచరులను బరిలోకి దించేందుకు వీలుగా పొంగులేటి ప్లానింగ్ చేసినట్లుగా చెబుతున్నారు. దీనికి సంబంధించి ఆయన ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారని చెబుతున్నారు. ఖమ్మం.. మహబూబ్ నగర్.. నల్గొండ.. వరంగల్ జిల్లాలకు చెందిన పలువురిని పార్టీలోకి చేరేందుకు వీలుగా కసరత్తు పూర్తి చేశారంటున్నారు. ఇప్పటివకు పరిమిత సంఖ్యలో మాత్రమే తెలిసిన సరికొత్త టీఆర్ఎస్ ను.. ఓపెన్ గా ప్రకటించేసి.. దానిక స్వరూపం గురించి పొంగులేటి వివరిస్తారని చెబుతున్నారు. మొత్తం 45 స్థానాల్లో పోటీ చేసి 15 స్థానాల్ని సొంతం చేసుకోవటమే తమ లక్ష్యమని పొంగులేటి తన సన్నిహితులతో చెబుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ ప్లాన్ లో భాగంగా కేసీఆర్ బాధితుల్ని ఒక చోటుకు చేర్చాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఇన్ ఛార్జిగా మజీ మంత్రి జూపల్లి.. నల్గొండ జిల్లాకు చకిలం అనిల్ కుమార్.. వరంగల్ జిల్లా బాధ్యతను తన వియ్యంకుడైన మాజీ ఎంపీ రామ సహాయం సురేందర్ రెడ్డి కొడుక్కి అప్పగించినట్లుగా చెబుతున్నారు. ఉమ్మడి అదిలాబాద్.. కరీంనగర్ జిల్లాలకు సంబంధించి సరైన నేతల కోసం వెతుకులాట సాగుతోంది. పార్టీ పేరు విషయంలో గులాబీ బాస్ కు షాకిచ్చేలా ప్లాన్ చేసినప్పటికీ.. పార్టీకి కామన్ సింబల్ ను ఎన్నికల కమిషన్ నుంచి పొందటం కష్టంగా ఉంటుందన్న మాట వినిపిస్తోంది. ఐదారు నెలల్లో జరిగే ఎన్నికల్లో పొంగులేటి పార్టీకి కామన్ సింబల్ సమస్యగా మారుతుందన్న మాట వినిపిస్తోంది. కోదండరాం పార్టీ తెలంగాణ జనసమితికి అలాంటి సమస్యే ఎదురైంది. ఈ నేపథ్యంలో కామన్ సింబల్ ను సాధించేందుకు వీలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సంబంధించినకీలక ప్రకటన ఈ నెల 15న తీసుకోనున్నట్లు చెబుతున్నారు. ఏమైనా.. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన టీఆర్ఎస్ పేరును వదిలేయటం ద్వారా తనకు ఎంత నష్టం వాటిల్లిందన్న విషయాన్ని కేసీఆర్ కు అర్థమయ్యేలా చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు చెబుతున్నారు. మరీ ప్లానింగ్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో తేలాలంటే మరికొంత కాలం వెయిట్ చేయక తప్పదు.






## కర్ణాటక ఫ్యూచర్ సీన్ ఏంటి?

### కింగా? కింగ్ మేకరా?



యావత్ దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టం దిగ్విజయంగా పూర్తైంది. పోలింగ్ పూర్తై.. ఈవీఎంలు నిక్షిప్తమైన వేళ.. శనివారం విడుదలయ్యే ఫలితాల మీద ఇప్పుడు చర్చమొత్తం సాగుతోంది. కర్ణాటకలో వెల్లడయ్యే ఫలితాలు రానున్న రోజుల్లో పలు రాజకీయ పరిణామాలకు కీలకం కానున్నట్లు చెబుతున్నారు. కర్ణాటకలో బీజేపీ విజయం సాధిస్తే.. దేశ రాజకీయాల్లో మరికొంతకాలం కమలనాథులకు తిరుగే ఉండదు. అందుకు భిన్నంగా కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మాత్రం.. బీజేపీకి కష్టాలు మొదలైనట్లేనని చెప్పాలి. ఎందుకంటే.. ఇంతకాలం తమకు తిరుగులేదన్నట్లుగా వ్యవహరిస్తున్న బీజేపీ ఆత్మవిశ్వాసం మీద కర్ణాటక ఓటమి కొట్టే దెబ్బ అంతా ఇంతా కాదన్న మాట వినిపిస్తోంది. అందుకే.. ఈ ఎన్నికల్లో విజయం తప్పనిసరిగా భావిస్తోంది.

మరో నాలుగు నెలల్లో ఛత్తీస్ గఢ్.. మధ్యప్రదేశ్.. తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల ఎన్నికలు వరుస పెట్టనున్న వేళ.. కర్ణాటక ఫలితం మిగిలిన ఎన్నికల మీదా ప్రభావం చూపటం ఖాయమంటున్నారు. మరి.. కర్ణాటక ఫలితాలు ఎలా ఉంటాయి? ఏం జరగనుందన్నది ఉత్కంటగా మారింది. పోలింగ్ కు ముందు సాగిన చర్చ చూస్తే.. కాంగ్రెస్ కు స్పష్టమైన మెజార్టీ ఈసారి లభిస్తుందన్న మాట బలంగా వినిపించింది. అందుకు భిన్నంగా ఎగ్జిట్ పోల్స్ ను చూసినప్పుడు.. కాంగ్రెస్.. బీజేపీలకు సొంతంగా అధికారంలోకి రావటం కష్టమన్న అభిప్రాయాన్ని వ్యక్తమయ్యేలా ఫలితాలు ఉన్నాయి. అదే జరిగితే.. జేడీఎస్ అపద్బాంధవుడిగా మారుతుంది. ఇప్పటివరకు ఉన్న అంచనాల ప్రకారం చూస్తే.. జేడీఎస్ కు కనీసం 20 స్థానాల్లో గెలుపొందుతుందని.. అదే జరిగితే ఆ పార్టీ కింగ్ మేకర్ గా మారుతుందంటున్నారు. అయితే.. కింగ్ మేకర్ అవసరం లేదని.. సొంతంగా గెలుస్తామన్న ధీమా కాంగ్రెస్.. బీజేపీల్లో వ్యక్తమవుతోంది. మొత్తంగా కర్ణాటకలో కింగ్ ఎవరు? కింగ్ మేకర్ ఎవరన్న దానిపై చర్చ కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం పన్నెండు గంటలకు కానీ ఈ విషయం మీద పూర్తి క్లారిటీ రానుంది. అప్పటివరకు చర్చల పరంపర కొనసాగనుంది.

## సంపాదకీయం

# గర్జించే రష్యా కాదు.. దారుణ రష్యా.. రుణ రష్యా.. అంతా తలకిందులు

గర్జించు రష్యా.. గాండ్రించు రష్యా.. దౌర్జన్య రాజ్యం ధ్వంసించు రష్యా.. లే లే రష్యా.. రా రా రష్యా.. సై అంటూ రష్యా.. జై అంటూ రష్యా.. కోటి చేతులు నిన్ను కోరి రమ్మన్నాయి.. కోటి గొంతులునిన్ను కోరి రమ్మన్నాయి.. అనంత ప్రపంచం అంతటా నీవై.. నీ గొడుగు నీడలు సాగించు రష్యా.. ప్రపంచం నీకోసం పరిపక్వంగా ఉంది.. రష్యా... రష్యా.. రష్యా.. ఓ రష్యా.. మహా కవి శ్రీ శ్రీస్వప్నం ఇది. అలాంటి రష్యా ఆర్థిక పరిస్థితి ఉక్రెయిన్ పై దురాక్రమణ తర్వాత ఇప్పుడు ఎలా ఉందో తెలుసా? అంతా తలకిందులైంది. వందేళ్లలో ఎన్నడూ లేనంతగా కుదేలైంది. 104 ఏళ్లలో తొలిసారిగా డబ్బుల్లేక రష్యా తన విదేశీ మారకద్రవ్య సార్వభౌమ రుణాన్ని 1918 తర్వాత తొలిసారి డిఫాల్ట్ చేసింది. ఉక్రెయిన్ పై యుద్ధం నేపథ్యంలో అమెరికా సహా యూరప్ దేశాలు విదేశీ రుణదాతలకు చెల్లింపు మార్గాలను మూసివేస్తూ ఆంక్షలు విధించడంతో రష్యా ఆర్థిక దిగ్బంధనంలో చిక్కుకుంది. సరిగ్గా నెల కిందట దీనిని గ్రహించిన రష్యా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషించింది. మే 7న దాదాపు 100 మిలియన్ డాలర్ల స్ప్రెడ్ ఇంటరెస్ట్ చెల్లింపులపై గ్రేస్ పీరియడ్ కోరింది. ఇప్పుడా గడువు ముగిసింది.

దీంతో డిఫాల్ట్ అయింది. రష్యా ఆర్థికంగా రాజకీయంగా దాదాపు ఒంటరిగా మిగిలిపోయిన పరిస్థితి నెలకొన్నది. మార్చి నుంచి దేశీయ యూరోబాండ్స్ ఇబ్బందికరస్థాయిలో ట్రేడ్ అయ్యాయి. సెంట్రల్ బ్యాంకు విదేశీ నిల్వలను స్తంభింపజేశారు. ఆర్థిక ఆంక్షల కారణంగా రష్యాలోని ప్రపంచ అతిపెద్ద బ్యాంకులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి విభజితమయ్యాయి.

**ఆర్థిక చక్రబంధం :** రష్యా నుంచి ఇంధనం సహజ వాయువు కొనబోమని యూరప్ దేశాలు.. ఆ దేశ సంపన్నులపై ఆంక్షలు.. రష్యా బ్యాంకులపై వేటు.. డాలర్లలో మాత్రమే చెల్లింపులకు ఆదేశాలు.. ఇలా ఒకటేమిటి..? రష్యా ఆర్థిక మూలాలను పశ్చిమ దేశాలు లక్ష్యంగా చేసుకున్నాయి. పైకి గంభీరంగా కనిపిస్తున్నా.. అమెరికా సహా యూరోపియన్ దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యాకు నష్టం వాటిల్లిన మాట వాస్తవం. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు డిఫాల్ట్ దెబ్బపడింది. రెండంకెల ద్రవ్యోల్బణం దారుణ ఆర్థిక సంకోచం నేపథ్యంలో ఇది కూడా ఆ దేశానికి దెబ్బే. అయితే డిఫాల్ట్ పైన రష్యా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేసింది. తమ వద్ద అవసరమైన నిధులు ఉన్నాయని తెలిపింది. అయితే ఆ తర్వాత గతవారం 40 బిలియన్ డాలర్ల సార్వభౌమ రుణాన్ని రూబుళ్లలో అందిస్తామని ప్రకటించింది. దాదాపు 100 ఏళ్ల తర్వాత విదేశీ రుణాల చెల్లింపులు చేయలేని స్థితికి రష్యా చేరింది. వాస్తవానికి రష్యా వద్ద 100 మిలియన్ డాలర్ల రుణ చెల్లింపులు చేసేందుకు నిధులు ఉన్నాయి. కానీ ఆంక్షల కారణంగా అంతర్జాతీయ రుణదాతలకు చెల్లింపులు చేయలేకపోయింది. ఇప్పటికే రుణచెల్లింపులు ఆపకూడదని భావించిన క్రెమ్లిన్కు ఇది పెద్ద ఎదురు దెబ్బ. రష్యా మే 27వ తేదీన రుణ చెల్లింపులకు సంబంధించి 100 మిలియన్ డాలర్ల సొమ్మును యూరోక్లియర్ బ్యాంక్కు పంపించింది. ఈ బ్యాంకు నుంచి ఇన్వెస్టర్లకు చెల్లింపులు జరగాలి. కానీ ఆ సొమ్ము యూరో క్లియర్ వద్దే నిలిచిపోయింది. గడువు తేదీ దాటి 30 రోజులు గడిచినా రుణదాతలకు సొమ్ము చేరలేదు. ఈ సొమ్మును నిలిపివేసినట్లు యూరోక్లియర్ వెల్లడించలేదు. కేవలం ఆంక్షలకు కట్టుబడి ఉన్నామని మాత్రమే పేర్కొంది. రష్యా యూరోక్లియర్కు సొమ్ము చెల్లించడానికి రెండురోజుల ముందు అమెరికా ట్రెజరీ శాఖ తీసుకొన్న నిర్ణయం ఈ పరిస్థితికి కారణమైంది. ఇన్వెస్టర్లకు రష్యా నుంచి వడ్డీ చెల్లింపు సొమ్మును తీసుకొనేందుకు కూడా మినహాయింపులు ఇవ్వకూడదని నాడు ట్రెజరీ డిపార్ట్మెంట్ నిర్ణయించింది. అమెరికా ట్రెజరీ నిర్ణయ పరిణామాలను క్రెమ్లిన్ అంచనావేసింది. దీంతో ఇన్వెస్టర్లకు రూబుళ్ల రూపంలో రష్యన్ బ్యాంక్ ద్వారా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. డాలర్ల రూపంలో ఉన్న కాంట్రాక్టులకు కూడా ఇదే విధానం వర్తించనుంది. 'పెట్టుబడిదారులకు సొమ్ము చేరడంలేదు'అంటూ రష్యా ఆర్థిక మంత్రి ఆంటోన్ సిల్యానోవ్ అంగీకరించారు. విదేశీ చెల్లింపు వ్యవస్థలు సహకరించకపోవడం విదేశీ ఇన్వెస్టర్ల సొమ్ము స్వీకరించకుండా నిషేధం విధించడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన విశ్లేషించారు. వాస్తవానికి ఇది ఏమీ రుణ ఎగవేత కాదని ఆయన పేర్కొన్నారు.

**నాడు లెనిన్ శకంలో.. నేడు పుతిన్ హయాంలో..** యునైటెడ్ సోవియట్ సోషలిస్ట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్) ఏర్పాటుకు ముందే.. సోవియట్ రష్యాగా ఉన్న సమయంలో వ్లాదిమిర్ లెనిల్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో.. అంటే 1918లో విదేశీ అప్పులు చెల్లించడంలో రష్యా విఫలమైంది. అది బోల్షివిక్ విప్లవ సమయం. నాడు ఐరోపా దేశాలు ఇచ్చిన రుణాలను చెల్లించేందుకు లెనిన్ నిరాకరించారు. బోరిస్ ఎల్సిన్పాలనలో రూబుల్ సంక్షోభం తలెత్తింది. అలా 1998లో రష్యా దేశీయ రుణ చెల్లింపుల్లో విఫలమైంది. దీంతో దేశీయ బాండ్లకు చెల్లింపులు నిలిపివేసి విదేశీ అప్పులు చెల్లించారు. మళ్లీఇప్పుడు పుతిన్ హయాంలో.. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా విదేశీ అప్పులను చెల్లించడంలో రష్యా విఫలమైంది.

# ఆదాయంపై కినుక..!



నిర్మల్ : నిరంతర పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు అనుమతుల పునరుద్ధరణతో ప్రభుత్వానికి ఇతోధిక ఆదాయం సమకూరే అవకాశ ముంది. అయినా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారు. విధులను పక్కనపెట్టారు. ఫలితంగా రావాల్సిన ఆదాయానికి చేజేతులా అడ్డుపడ్డట్లయ్యింది. జిల్లా తూనికలు- కొలతల శాఖ కార్యాలయం పరిధిలోని తతంగమిది.

సగం కూడా జమ కాలేదు..

మార్కెట్లో తూనికలు, కొలతలకు సంబంధించిన ప్రతి వ్యాపారాన్ని నిరంతరం తనిఖీ చేసేందుకు, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు ఈ శాఖకు అధికారముంది. జిల్లా పరిధిలో 63 పెట్రోలు బంకులున్నాయి. వీటిద్వారా (నిర్వహణ అనుమతులు పునరుద్ధరించుకోవడం) ప్రభుత్వానికి ఏటా రూ.17 లక్షలు ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది కేవలం రూ.4 లక్షలు మాత్రమే సమకూరినట్లు తెలుస్తోంది. అంటే.. రూ.13 లక్షల లోటు. ఉన్న అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటే ఆదాయం జమవుతుంది. కానీ.. క్షేత్రస్థాయిలో ఇది లోపించింది. ఫలితంగా ఆదాయంలో కోతపడింది.

అక్రమాలకు ఆస్కారం..!

అధికారుల తనిఖీల్లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. బంకుల పనితీరును పూర్తిగా పరిశీలించి, అన్నీ సక్రమం గా ఉంటే అనుమతులు కేటాయించాలి. తనిఖీ లేక, అనుమతులు రెన్యువల్ చేయకపోవడంతో బంకుల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారే అవకాశముంటుంది. ఇంధనకల్తీ, పరిమాణంలో మార్పులతో వినియోగదారులను నష్టం కలుగుతోంది. దీనికితోడు చిత్తశుద్ధితో పునరుద్ధరించుకునేందుకు దరఖాస్తు చేసుకునేవారికీ ఇబ్బందులు తప్పవు. సకాలంలో అనుమతి రాకపోతే.. మూడునెలలకోసారి జరిమానా జతవుతూ చెల్లించాల్సిన రుసుము పెరిగిపోతోంది. ఇదంతా ఆన్లైన్లోనే జరగడంతో బంకుల నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పనితీరుపై అనుమానాలు ?

నిరంతర తనిఖీలతో వినియోగదారులకు ప్రయోజనం కల్గించాల్సిన అధికారులు సక్రమంగా పనిచేయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే వాదనలు వినిపిస్తున్నాయి. కొంతమంది పెట్రోలు బంకు నిర్వాహకులు రెన్యువల్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నా వాటిని ఎప్పటికప్పుడు అప్రూవల్ చేయలేదని, మరికొందరు వార్షిక రుసుము చెల్లించినా అది ప్రభుత్వ ఖాతాలో జమకాలేదని తెలుస్తోంది. ఫలితంగా అనుమతులు పునరుద్ధరణకాలేదు. దీనివల్ల సకాలంలో దరఖాస్తు చేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. వేధింపులకు గురిచేసేందుకు కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల వైఖరి కారణంగా బకాయిల పేరిట అన్యాయంగా అదనంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, తామెందుకు నష్టపోవాలని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన ఓ బంకు నిర్వాహకుడు ఈ విషయమై రాతపూర్వకంగా ఫిర్యాదుచేయడం గమనార్హం.

ఉన్నతాధికారులకు నివేదించాం :పి.రవీందర్, తూనికలు- కొలతల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి

పెట్రోలు బంకులకు సంబంధించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సమకూరకపోవడం వాస్తవమే. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, ఆన్లైన్లో వచ్చే రెన్యువల్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీచేయాల్సి ఉండగా, గతంలో జాప్యం జరిగింది. ఇది కొంతమంది బంకు నిర్వాహకులకు ఇబ్బందికరంగా మారింది. సకాలంలో దరఖాస్తు చేసినా బకాయిల పేరిట దాదాపు మూడింతల డబ్బులు చెల్లించాల్సి వస్తోందంటూ ఓ బంకు నుంచి ఫిర్యాదు అందింది. డబ్బులు చెల్లించినా రెన్యువల్ కాని దరఖాస్తులు 4 ఉన్నాయి. అదే సమయంలో రెన్యువల్ కోసం జిల్లావ్యాప్తంగా 350 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు గుర్తించాం. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నాం. అన్ని వివరాలను సవివరంగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

నిధుల లేమి.. పనులు కావేమి?పట్టణంలోని జంగల్‌హన్మాన్ ఆలయం వెనుక అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అర్బన్‌పార్కు అసంపూర్తి పనులతో దర్శనమిస్తోంది. పట్టణ వాసులకు అటవీ ప్రాంత ఆహ్లాదాన్ని పంచేలా సుమారు రూ.40 లక్షలు కంపా నిధులతో కంచె(ఫెన్సింగ్) పనులు పూర్తి కాగా, తెలంగాణకు హరితహారంలో రూ.80లక్షలతో చేపట్టిన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటివరకు చేసిన పనులకు గుత్తేదారుకు డబ్బులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు సమాచారం. ఈ పనులు చేపట్టి ఏడాది పూర్తి కావస్తున్నా ఇక్కడ నిర్మించాల్సిన ప్రధాన ద్వారం ఆర్చి పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఉద్యానవనం లోపల నిర్మించాల్సిన వాచ్‌టవర్, మరుగుదొడ్లు, పర్యటకులు సేద తీరేందుకు అందంగా నిర్మిస్తున్న పగోడా నిర్మాణాలు చివరి దశలో నిలిచిపోయాయి. ఇంకా వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనుల జాప్యంపై ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావును వివరణ కోరగా నిధుల కొరతతో జాప్యం జరిగిందని.. గుత్తేదారుతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూస్తామని పేర్కొన్నారు.

# పాఠశాలల్లోనే ఆధార్ నమోదు



భీంపూర్ : ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు తప్పనిసరి ధ్రువీకరణగా మారింది. అందునా పాఠశాలల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు అత్యంత ఆవశ్యంగా తయారైంది. అధికారయంత్రాంగం తాజా చర్యలతో జిల్లాలో విద్యాశాఖ వద్ద ఉన్న సమాచారం మేరకు ఆధార్‌కార్డులేని 6,460 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో 18 మండలాలు ఉండగా.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి 1439 ఉండగా.. అందులో కిందటేడాది డైస్ లెక్కల ప్రకారం నర్సరీ మొదలుకొని పదో తరగతి వరకు 1,35,868 మంది విద్యార్థులు ఉన్నారు. తాజాగా బడిబాట కార్యక్రమంలో, నేరుగా పాఠశాలల్లో ప్రవేశం పొందిన వారిలోనూ ఆధార్‌కార్డు లేని విద్యార్థులు చాలామందే ఉన్నట్లుగా అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ అమలు చేసే ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటివి ఆయా విద్యార్థులకు అందాలంటే ఆధార్ నమోదు తప్పనిసరి అయ్యింది. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు పేదలు కావడం, వారు చదువుకునే ప్రాంతంలో ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడం నమోదు ప్రక్రియ పట్ల అనాసక్తిని ప్రదర్శిస్తున్నారు.

నమోదు.. నవీకరణ

ఆధార్ సంఖ్య లేని విద్యార్థులను ఇది వరకే గుర్తించగా.. వారందరికి పాఠశాలకు వెళ్లి ఆధార్ నమోదు ప్రక్రియ చేపడతారు. ఇందుకోసం మండలానికి ఒక ఆధార్‌కిట్‌ను అందజేశారు. ఇప్పటికే ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ సైతం పూర్తయ్యింది. హెచ్‌ఎం ధ్రువీకరించిన పత్రం తీసుకుని విద్యార్థులకు ఆధార్ లేకుండా నమోదు చేస్తారు. ఇప్పటికే ఆధార్ కార్డు ఉండి వేలిముద్రలు, కనుపాపల స్కానింగ్‌తో పాటు చరవాణి నెంబరును ఆధార్‌కార్డుకు అనుసంధానించేలా నవీకరణ ప్రక్రియ కూడా చేపడతారు.

తప్పనిసరిగా నమోదు చేయించాలి

రంగినేని సూరజ్‌రావు, సమన్వయకర్త

త్వరలో ఆధార్ నమోదు కోసం సిబ్బంది పాఠశాలలకే వస్తారు. ఎవరైతే ఆధార్‌కార్డు కలిగి ఉండరో వారంతా తప్పనిసరి నమోదు చేయించుకునేలా ఉపాధ్యాయులు చూడాలి. ఇదివరకు ఉన్న కార్డులో వేలిముద్రలు, కనుపాపల స్కానింగ్ వంటి నవీకరణ ప్రక్రియ చేపడతారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వీరంతా భీంపూర్ మండలం అర్లి-టి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల చిన్నారులు. ఇటీవల ముగిసిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రవేశం పొందారు. ఇందులో చాలామందికి ఆధార్‌కార్డులు లేవు. ఇలాంటి వారందరికీ విద్యాశాఖ యంత్రాంగమే పాఠశాలకు వచ్చి ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టనుంది.

ప్రయోగాత్మకంగా.!

ఇటీవల ఆదిలాబాద్‌లోని మండల వనరుల కేంద్రంలో బాలికలకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఆధార్ నమోదు ప్రక్రియపై పాఠశాలలకు వెళ్లే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలానికి ఒక ఆధార్ నమోదు కిట్‌ను అందజేశారు.

# ఉన్నత విద్యకు గ్రహణం వీడేనా..!

సంగారెడ్డి : 'ప్రధాన పట్టణమైన తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది నుంచే డిగ్రీ కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా. తూప్రాన్ సమీప గ్రామాల విద్యార్థులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తీరుతాయి. సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.'

- సీఎం కేసీఆర్ (2018లో తూప్రాన్‌లో 50 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా..)

ఇలా సాక్షాత్తూ ముఖ్యమంత్రినే హామీ ఇచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. అంతకంటే ముందు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం ఇదే హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన తూప్రాన్, రామాయంపేట పట్టణాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల కాలంగా కళాశాలల ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే.. :

జిల్లా కేంద్రం మెదక్, నర్సాపూర్ సమీపంలోని పెద్దచింతకుంటలో ప్రభుత్వం డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేసింది. ఇక తూప్రాన్, రామాయంపేట పట్టణాల్లో వీటి ఊసే లేకపోవడంతో కొన్నేళ్లుగా ఎంతోమంది విద్యార్థులు ఇంటర్‌తోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి తూప్రాన్‌వాసులు హైదరాబాద్, గజ్వేల్, రామాయంపేట సమీప గ్రామాల ప్రజలు మెదక్, కామారెడ్డి, సిద్దిపేటకు వెళ్లాల్సిందే. దూర ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి.

55 కి.మీ. పరిధిలో.. : దేశంలో అత్యంత పొడవైన 44వ జాతీయ రహదారితో తూప్రాన్, రామాయంపేట పట్టణాలు విస్తరించి ఉన్నాయి. సదరు జాతీయ రహదారి జిల్లాలో విస్తరించి ఉన్న 55 కి.మీ. పరిధిలోని మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట మండలాల పరిధిలో ఒక్కటంటే ఒక్క కళాశాల లేకపోవడం గమనార్హం. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. నెలకు వేలాది రూపాయలు ఫీజులు చెల్లించలేక, కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోలేక నానాఅవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ ఏడాదైనా ఆయా చోట్ల కళాశాలల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటే మేలు చేసినట్లవుతుంది.

ఏటా 1300 మంది వరకు..

తూప్రాన్, రామాయంపేటల్లో ప్రతి ఏటా 1300 మంది వరకు ఇంటర్ పూర్తి చేసి బయటకు వస్తున్నారు. వీరిలో ఆర్థికంగా ఉన్న వారు దూర ప్రాంతాలకు వెళ్తుండగా.. ఇక కూలీల పిల్లలు ఇక్కడితోనే ఆపేస్తున్నారు. 50 శాతం మంది మాత్రమే అష్టకష్టాలు పడి డిగ్రీ విద్యను పూర్తి చేస్తుండటం గమనార్హం. తూప్రాన్‌లో గతంలో కళాశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు సైతం ప్రతిపాదించారు. ఆ తర్వాత దాని ఊసే మరిచారు. రామాయంపేటలో చాలా కాలంగా కళాశాల ఏర్పాటుకు స్థానికుల నుంచి డిమాండ్ వినిపిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

సమస్యను గుర్తించాలితూప్రాన్ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రతి ఏటా వందలాది మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్థలం కేటాయించినా కళాశాల మంజూరు మాత్రం కాలేదు. ఇక్కడున్న అధికారులు పాలకులు ప్రత్యేక దృష్టిసారించి చొరవ చూపాలి. లేదంటే రానున్న రోజుల్లో మరింత మంది చదువు మధ్యలో మానేసే అవకాశం ఉంది.

- సాయికుమార్, స్థానికుడు

మూడేళ్ల క్రితమే..తూప్రాన్‌లో మూడేళ్ల క్రితమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాం. ప్రస్తుతం జూనియర్ కళాశాల సమీపంలోనే కళాశాల నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని గుర్తించి అధికారులకు నివేదిక అందించాం. కళాశాల మంజూరు కాగానే పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

- శ్యామ్‌ప్రకాశ్, ఆర్డీవో, తూప్రాన్

# అంతర్జాలంలో.. అభ్యాస దీపికలు

సంగారెడ్డి : పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సీఈఆర్‌టీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పుస్తకాలు ఇంకా సరఫరా కాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' పేరుతో స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలోని వివిధ పాఠ్యాంశాల నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అంతర్జాలంలో నిక్షిప్తం చేసింది. రెండు నెలల క్రితం వీటిని అంతర్జాలంలో అప్‌లోడ్ చేశారు. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని చదువుకునే అవకాశం ఉంది.

ప్రైవేటుకు దీటుగా..

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తమ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు కీలకమైన పాఠ్యాంశాలతో స్టడీ మెటీరియల్ అందుబాటులోకి తీసుకు వస్తున్నాయి. వీటికి దీటుగా ఎస్‌సీఈఆర్‌టీ కూడా ప్రభుత్వ, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అభ్యాస దీపికను తీసుకు వచ్చింది. వీటిని చదవాలంటే %http:///https:///scert.telangana.gov.in% అంతర్జాలం ఓపెన్ చేయగానే ఫ్లాష్ న్యూస్‌లో ఈ దీపిక కనిపిస్తుంది. దీన్ని క్లిక్ చేయగానే గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్ తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో కనిపిస్తుంది. ఎక్కువ మంది విద్యార్థులకు తెలియక పోవడంతో వీటిని వినియోగించుకోవడం లేదు. ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటి నుంచే..

ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పది విద్యార్థులు 54,200 దాకా ఉన్నారు. 2022-23 సంవత్సరానికి పదో తరగతి చదివే వీరు ఈ దీపికను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు వివిధ రకాల దీపికలను అందుబాలోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకుని చదివేందుకు సులభంగా ఉంటుంది. వీటిని సాధన చేసిన తరువాత సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవచ్చు.ఉపాధ్యాయులకు సూచనలిచ్చాం...- నాంపల్లి రాజేశ్, జిల్లా విద్యాధికారి, సంగారెడ్డిరాష్ట్రంలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఈ అభ్యాస దీపికను తయారు చేశారు. ఇవి చదవడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

# నకిలీ ఇంటి నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా!

వరంగల్ : అధికారులు తలుచుకుంటే అక్రమాలకు కొదవా అన్నట్లు తెగబడుతున్నారు ఉన్నది లేనట్లు..లేనిది ఉన్నట్లు రికార్డులు సృష్టిస్తూ తప్పుడు పత్రాలు..నకిలీ ఇంటి, అసెస్‌మెంటు నంబర్లతో దర్జాగా అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ల దందా సాగిస్తున్నారు. నర్సంపేట పురపాలక పరిధిలో జరుగుతున్న ఈ దందాలో స్థిరాస్తి వ్యాపారులు, దళారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు సంబంధాలున్నట్లు తెలిసింది. ఈ అక్రమ తతంగంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. నకిలీ ఇంటి, అసెస్‌మెంటు నంబరుతో నర్సంపేట 7వ వార్డు పరిధిలో జరిగిన ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్‌లో 'న్యూస్‌టుడే' పరిశీలించగా తప్పుడు(ఫేక్)గా తేలింది. అధికారులు దృష్టి సారిస్తే ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు వందల సంఖ్యలో ఉంటాయనేది స్పష్టమవుతోంది.

ఏమి కావాలంటే..రిజిస్ట్రేషన్ చేయాలంటే భూమి స్వభావం తెలిపే దస్తావేజులు ఇళ్ల స్థలాలైతే లేఅవుట్, లేదంటే ఎల్ఆర్ఎస్ చెల్లించినవైతే రిజిస్ట్రేషన్ చేస్తారు. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు, మధ్య దళారులు ప్రభుత్వ, అసైన్డ్ వంటి ఇతర భూములను ఇంటి నంబరు, అసెస్‌మెంటు నంబరు, ఇంటి పన్ను చెల్లించిన పాత రసీదులు, కుటుంబ సభ్యుల, ఇంటి యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి. సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది, అధికారులు అవి అసలైనవా నకిలీవా నిర్ధారించుకొని రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యుటేషన్ (పేరు మార్పిడి) చేసి పుర కార్యాలయానికి పంపుతారు.

జరుగుతోందిలా..

నర్సంపేటలో నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ భూములను, దస్తావేజుల్లేని ఖాళీ ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ కోసం మీ సేవ కేంద్రానికెళ్లి ఆధార్ కార్డుతో అందులో ఓ పాత ఇల్లున్నట్లు పేర్కొని ఇంటి నంబరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. దానిని మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారి తాత్కాలికంగా ఇంటి, అసెస్‌మెంటు నంబరు కేటాయిస్తారు. ఆ నంబర్లతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఆన్‌లైన్‌లో ఆ నంబర్లు కనిపించవు. ఇలా అక్రమంగా తాత్కాలికంగా ఇంటి, అసెస్‌మెంటు నంబరు కేటాయింపు, రిజిస్ట్రేషన్ చేసేందుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కిందటి నెల చివరి రెండు రోజుల్లో నర్సంపేటలోని 7వ వార్డు పరిధిలో రిజిస్ట్రేషన్ అయిన ఇంటి, అసెస్‌మెంటు నంబరును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే 'సారీ నో రికార్డ్స్ ఫౌండ్' అని వస్తోంది. పట్టణానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి ఒకరు ఎకరం పొలాన్ని నాలా లేకుండా అక్రమ ఇంటి, అసెస్‌మెంటు నంబర్ల సాయంతో ఒక్కొక్కరికి 1200 గజాల చొప్పున నలుగురి పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారమైతే నాలా పన్ను చెల్లించాలి. గ్రీన్‌ల్యాండ్ కు స్థలం వదలాలి. ఎల్ఆర్ఎస్ లేదంటే లేఅవుట్ చేయించాలి. ఇదంతా చేయకుండా రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి 'కానుక'లిచ్చి పని ముగించినట్లు సమాచారం. ఉన్నతాధికారులు చొరవజూపి అక్రమ రిజిస్ట్రేషన్ల దందాపై లోతుగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగుచూస్తాయనేది నిజం.

నాకు తెలియదునా లాగిన్‌లో దరఖాస్తు చూశాను కాని దానిని నేను, సంబంధిత అధికారి ఎవరూ ఆమోదించలేదు, తిరస్కరించలేదు. ఇంతలోనే రిజిస్ట్రేషన్ జరిగి మ్యుటేషన్ చేసి కార్యాలయానికి రాగానే ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే తప్పుడు నంబరు అని తేలింది. వెంటనే ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ దస్తావేజు వివరాలు రెండు రోజుల్లో అందించాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులిచ్చాం.

వెంకటస్వామి,పుర కమిషనర్ నర్సంపేట

ఆన్‌లైన్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేశాంపట్టణానికి చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ కోసం వచ్చి ఆన్‌లైన్‌లో ఇంటి, అసెస్‌మెంటు నంబర్లు చూపడంతో మున్సిపల్ అధికారులు ఆమోదిస్తేనే వచ్చినట్లుగా భావించి రిజిస్ట్రేషన్ చేశాను.సాయిరాం, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, నర్సంపేట

# పార్కు ఏర్పాటు ఎప్పుడో?

ముస్తాబాద్ : పట్టణ ప్రజలకు పర్యాటక ప్రాంతం కలగానే మిగిలిపోతుంది. మంత్రి కేటీఆర్ పెద్దచెరువు కట్ట కింద పార్కు ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. దాదాపు అయిదేళ్లు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికే పెద్దచెరువు కట్టను మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దిన సంగతి విదితమే. కట్ట కింద కూడా పార్కు ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలతోపాటు పరిసరాల ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముస్తాబాద్ మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువు కట్ట అయిదేళ్ల క్రితం తెగిపోయింది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రూ. 6 కోట్లకు పైగా నిధులు వెచ్చించి కట్టను సుందరీకరించారు. మినీ ట్యాంకుబండ్‌లా తీర్చిదిద్దారు. మండుటెండల్లోనూ కాళేశ్వరం జలాలతో చెరువు నిండుకుండలా నిండి అలుగు పారుతుంది. కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. పలువురు ఉదయం, సాయంత్రం ఓపెన్ జిమ్ వద్దకు వెళ్లి కసరత్తు చేస్తున్నారు. సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు వేయగా ఆకతాయిల చేష్టలకు వాటి ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. కట్టకింద భాగంలో పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, కంపోస్టు షెడ్డు, విద్యుత్తు ఉప కేంద్రాన్ని నిర్మించారు. వీటికి వెళ్లేందుకు మార్గం లేదు. ప్రభుత్వ స్థలం లేక, ప్రైవేటు స్థలానికి చెందిన వారు రోడ్డు వేయడానికి అభ్యంతరం చెబుతున్నారు. చెరువు కట్టకింద భాగంలో కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రోడ్డు పక్కనే రత్నాలకుంట ఉంది. కుంటను పూడ్చే ప్రయత్నం చేయగా పలువురు అడ్డుకున్నారు. కుంటలో గుర్రపు డెక్క బాగా పెరిగింది. కుంటలో నిత్యం నీరు నిల్వ ఉన్నందున ఫౌంటెయిన్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పరిసర కాలనీవాసులు కోరుతున్నారు. చెరువు కింద మాత్రం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఎనిమిది ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. అవసరమైతే స్థలం కొనుగోలు చేసి పార్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

రత్నాలకుంటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

గ్రామ శివారులో పెద్ద చెరువు కట్ట కింద డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. శ్మశాన వాటిక నిర్మించారు. పక్కనే చెత్తాచెదారం వేయడంతో పరిసరాలు, గ్రామ శివారులో ఉన్న ఎస్సీ కాలనీవాసులకు దుర్గంధం వెదజల్లుతుంది. అంత్యక్రియల సమయంలో అక్కడికి వెళ్లే వారు కంపు భరించలేకపోతున్నామని మండిపడుతున్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. కట్టకింద పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేయాలి. రత్నాలకుంటలో గుర్రపు డెక్కను తొలగించి ఫౌంటెయిన్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి.

# పడకేసిన అభివృద్ధి పనులు



జనగామ : జిల్లా కేంద్రం జనగామ పట్టణంలో అభివృద్ధి పనులు పడకేశాయి. ప్రతిపాదనల్లోనే మగ్గుతున్న పనులు కొన్నైతే.. నిధులు లేక కొన్ని పనులు ముందుకు సాగడం లేదు. నిధులు మంజూరు అయిన పనులు సైతం ఆగుతూ.. సాగుతూ.. అన్నట్లు పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ముంచుకొచ్చే లోపు పూర్తి కావాల్సినవి ముందుకు సాగక పోవడంతో పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రూ.30 కోట్ల అభివృద్ధి పనులతో పాటు, ప్రత్యేక నిధులతో జరుగుతున్న వాటిని సకాలంలో పూర్తి చేయాల్సి ఉంది.

ఎక్కడెక్కడంటే..పట్టణంలోని వీవర్స్‌కాలనీ క్రాస్ రోడ్డు వద్ద పెద్ద మోరీ స్థానంలో ప్రత్యామ్నాయంగా రూ.కోటి వ్యయంతో రైల్వేశాఖ కల్వర్టు నిర్మించింది. దీనికి అనుసంధాన రోడ్ల నిర్మాణానికి రూ.11 లక్షల ప్రణాళిక సిద్ధం చేసి పనులు చేపట్టారు. అంచనా తప్పిన కారణంగా ఆ నిధులు ఒక వైపు పనులకే సరిపోయాయి. స్టేడియం కూడలి నుంచి కల్వర్టు వరకు అనుసంధాన రహదారి పనులు ఏడాదిన్నరగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనులపైలో కథనాలు ప్రచురితం కావడంతో 12వ వార్డు కౌన్సిలర్ ఈ సమస్యను పురపాలక వర్గం దృష్టికి తేవడంతో రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. గత నెలలో పనులు ప్రారంభించేందుకు కల్వర్టు వద్ద మట్టి తొలగించారు. రెండు రోజులు పనులు చేసి నిలిపివేశారు. కాల్వ నిర్మాణానికి మేస్త్రీలు దొరకడం లేదని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. వాసవీ కాలనీ-2లో రూ.10 లక్షలతో అంతర్గత రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించి ఏడాది గడిచినా పనులు జరగలేదు. సమస్యను కాలనీవాసులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. వార్డు కౌన్సిలర్, అధికారుల దృష్టికి తేగా గత నెలలో మెటల్ వేసి పనులు నిలిపివేశారు. స్థల వివాదంతో పాటు, సాంకేతిక కారణాలను చూపుతూ పనులు పక్కన పెట్టారు. నాలుగో వార్డులోనూ పనులు పూర్తి కావాల్సి ఉంది.రూ.కోటి అంచనా వ్యయంతో ప్రారంభించిన ఆదర్శ వైకుంఠ ధామం పనులు ఏడాదిగా నత్తనడక నడుస్తూ.. నెల రోజులుగా పనులు నిలిచిపోయాయి.

పట్టణ సుందరీకరణ పథకంలో భాగంగా నాలుగు ప్రధాన రహదారుల వెంట విభాగినుల నిర్మాణానికి అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ రహదారిలో చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు వరకు ఒక ప్యాకేజీ, అక్కడి నుంచి పెంబర్తి బైపాస్ క్రాస్ రోడ్డు వరకు మరో ప్యాకేజీ పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ప్రమాదాల సందర్భంగా కూలిన విద్యుత్తు స్తంభాలు, దీపాల ఏర్పాటుకు గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదం లభించినా పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలంలోపు విభాగినుల నిర్మాణం పూర్తయితే, వాటి మధ్యలో గార్డెనింగ్ పనులు చేపట్టవచ్చు.స్థానిక 10, 11 వార్డుల పరిధిలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. దీని పరిష్కారం కోసం రూ.11 లక్షలతో భువనేశ్వరి మందిరం వరకు నిర్మించాల్సిన కాల్వ ప్రతిపాదన దశలోనే ఉంది.నెహ్రూ పార్కు నుంచి సాయినగర్ వరకు 60 అడుగుల రహదారి పనులు నిధులు లేక నిలిచిపోయాయి. స్థానిక ఆర్వోబీ కింద గార్డెనింగ్ పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదు. పాత గేటు అవతలి వైపు ఆర్వోబీ కింద సుందరీకరణ పనులు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. రూ.40 లక్షల నిధులున్నా రాత్రి బస భవనం (నైట్‌షెల్టర్) స్థల నిర్ధారణ అంశం కొలిక్కి రాలేదు. వివిధ వార్డుల్లో రూ.5 లక్షల చొప్పున మౌలిక సదుపాయాల కల్పనకు కౌన్సిల్ తీర్మానించినా పనులు జరగడం లేదని కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో పార్కు అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బృహత్ ప్రకృతి వనం, రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన జంతు సంరక్షణ కేంద్రం పనులు పూర్తి కాలేదు. ఆధునిక ధోబీఘాట్, బహుళ ప్రయోజన వేడుకల మందిరం ప్రతిపాదన దశలోనే ఉన్నాయి.

త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు..

వివిధ పథకాల కింద చేపట్టిన నిర్మాణాలు అకాల వర్షాలు, ఇతర కారణాలతో ఆలస్యమవుతున్నాయి. వాటిపై సమీక్షించి వీలైనంత త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.చంద్రమౌళి, డీఈ జనగామ పురపాలిక

# అన్నదాతకు కడగండ్లు!



జయశంకర్ : జిల్లాలో సాగునీటికి చెరువులే ప్రధాన ఆధారం. గతేడాది అధిక వర్షాల కారణంగా కాటారం, మహాముత్తారం, భూపాలపల్లి, తదితర మండలాల్లో చెరువులకు గండ్లు పడ్డాయి. వరదలకు మత్తళ్లు దెబ్బతినడం, చెరువు కట్టలు బలనపడి బుంగలు పడటం, నీటి లీకేజీలు తదితర సమస్యలు ఎదురయ్యాయి. దీంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం లేదు. ఏడాది కావస్తున్నా.. మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వచ్చే వానాకాలంలో ఆయా ప్రాంతాల్లో పంటలు పండించడం ప్రశ్నార్థకంగా మారింది. కాటారం మండలం ఒడిపిలవంచ ఊరచెరువు మత్తడి ధ్వంసమై చుక్క నీరు నిలవడం లేదు. వీరాపూర్ చెరువు కట్టకు గండి పడిపోవడంతో మైదానాన్ని తలపిస్తోంది. జాదరావుపేటలో రఘుపల్లి చెరువు, గూడూరులోని ఊరచెరువులకు గండ్లు పడటంతో ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. బొప్పారంలోని కోమటికుంట చెరువు తూము ప్రాంతం కొట్టుకుపోయింది.. ఒడిపిలవంచలోని రవికుంటకు బుంగలు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. మహాముత్తారం మండలం నిమ్మగూడెంలోని జగ్గని చెరువు కట్ట తెగిపోయి నీరంతాపోయింది. అక్కడి రైతులు రెండు పంటలు నష్టపోయారు. స్తంభంపల్లి(పికె) చెరువుదీ అదే పరిస్థితి. దాదాపు 20 చెరువుల వరకు మరమ్మతులకు గురయ్యాయి. మరో 30 చెరువుల తూముల మరమ్మతులు, లీకేజీలు, కాల్వలు ధ్వంసం, ఇలాంటి పనులు చేపట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల తాత్కాలిక, మరికొన్నిచోట్ల ఓఅండ్ఎం కింద మరమ్మతులు చేస్తున్నారు. గండ్లు పడిన చెరువులను పట్టించుకోవం లేదు. ఈ నెలలోనే పనులు చేయాలి.. లేందటే జూన్‌లో వర్షాలు పడితే నీరంతా వృథాగా పోతుంది. చెరువుల మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపించామని.. నిధులు రాగానే పనులు చేపడతామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇది కాటారం మండలం వీరాపూర్ చెరువు.. ఆయకట్టు 458 ఎకరాలు. కట్టకు గండి పడటంతో చెరువులో నీరు నిలవడం లేదు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకుంటే సాగునీటికి తీవ్ర సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.కాటారం మండలం బొప్పారంలోని కోమటి చెరువు ఇది.. వరదలకు తూము కొట్టుకుపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తూముకు బదులు పైపులు వేసి పంటలకు నీరందిస్తున్నారు. వర్షాకాలంలో కొట్టుకుపోయే అవకాశం ఉందని, శాశ్వత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మహాముత్తారం మండలం నిమ్మగూడెంలోని జగ్గని చెరువు కట్ట తెగిపోయిన దృశ్యమిది. ఏడాదైనా మరమ్మతులు చేయలేదు. చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. వచ్చే వానాకాలానికి సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.మహాముత్తారం మండలం నిమ్మగూడెంలోని జగ్గని చెరువు కట్ట తెగిపోయిన దృశ్యమిది. ఏడాదైనా మరమ్మతులు చేయలేదు. చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. వచ్చే వానాకాలానికి సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు పంటలు సాగు చేయలేదు

గతేడాది వర్షాకాలంలో నిమ్మగూడెంలోని జగ్గని చెరువుకట్ట కొట్టుకుపోయింది. వానాకాలం, యాసంగి పంటలు సాగు చేయలేదు. పంటలు పండించేందుకు అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

గాడివి సమ్మయ్య, రైతు నిమ్మగూడెం, మహాముత్తారం మండలం

మరమ్మతు చేయాలి

చెరువుకు పడిన గండికి మరమ్మతు చేయాలి. వర్షాకాలం సమీపిస్తోంది. వర్షాలు ఆరంభమైతే పనులు చేపట్టే పరిస్థితి ఉండదు. చెరువులో చుక్క నీరు ఆగడం లేదు. అధికారులు వెంటనే పనులు చేసి అందుబాటులోకి తేవాలి.బాపురెడ్డి, రైతు వీరాపూర్, కాటారం మండలం

# ఉపాధి హామీ.. వసతుల లేమి..!

మహబూబాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధిని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో పని చేసే కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని నిర్దేశించినప్పటికీ.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. గతంలో కూలీలు ఉపయోగించే పరికరాలు గునపం, పార, జంగిల్ కత్తెరకు డబ్బులు చెల్లించేవారు. ప్రస్తుతం ఆ చెల్లింపులను నిలిపివేయడంతో పని ప్రదేశానికి పరికరాలను తేవడానికి కూలీలు వెనకాడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో ఎండ తగలకుండా ఉండేందుకు టార్పాలిన్ టెంట్లు పంపిణీ చేశారు. దీంతో పాటు ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడవేమి కనిపించడం లేదు. కనీసం మంచినీళ్ల సదుపాయం కూడా లేకపోవడంతో కూలీలు ఇంటి దగ్గరనుంచే నీళ్ల సీసాలను తెచ్చుకుంటున్నారు. గతంలో ఈ సదుపాయాల నిమిత్తం అందించిన సొమ్ము ప్రస్తుతం ఏమైంది? అని పలువురు కూలీలు ప్రశ్నిస్తున్నారు.

అప్పుడలా... ఇప్పుడిలా..జిల్లాలో మొత్తం కూలీలు 42,986 మంది కూలీలు పనులకు వెళ్లగా వారిలో సుమారు 5వేల మంది గునపం పనులు చేస్తుంటారు. గునపానికి రోజుకు రూ.10 చొప్పున వారానికి రూ.60 చెల్లించాల్సి ఉండగా వాటిని రద్దు చేయడంతో కూలీలు నష్టపోవాల్సి వస్తోంది.

కానరాని ప్రథమ చికిత్స కిట్లు

ఉపాధి కూలీలకు ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లు అందజేసేవారు. అవి ఇప్పుడు ఎక్కడా కనిపించట్లేదు. గాయాలైన వారిని నేరుగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. స్వల్ప గాయాలైన కూలీలు సొంతంగా గ్రామీణ వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు.

నీడ పరదాలు ఏవి?వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతంలో ప్రతి గ్రూపు ఒక టార్పాలిన్ టెంట్‌లు అమర్చుకుని పని చేస్తుండేవారు. ప్రస్తుతం ఆ సదుపాయం లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండొచ్చినా.. వానొచ్చినా పని ప్రదేశాల్లో తలదాచుకోవడం కష్టమవుతోందని వాపోతున్నారు.

# వైద్య సేవలకు జాతీయ గుర్తింపు

ముస్తాబాద్ : వైద్య సిబ్బంది సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు రోగులకు బాగా సేవలు అందిస్తున్నారు. ఫలితంగా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్)కు ఎంపికైంది. కేంద్ర బృందం నిర్వహించిన సర్వేలో 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. దీనికి వరుసగా మూడేళ్లు పాటు నిధులు రానున్నాయి. వీటితో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఏర్పడనున్నది.

నిబంధనలకు అనుగుణంగా...ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌క్వాస్‌కు ఎంపికయ్యే విధంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుమన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి శ్రీరాములు ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్నారు. జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సిబ్బంది జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. ఇక్కడికి వచ్చే రోగులను పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పటిష్ఠంగా నిర్వహిస్తూ మంచి వాతావరణం కల్పిస్తున్నారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలకు సంబంధించిన చార్టులను పీహెచ్‌సీ గోడలపై ప్రదర్శించారు.

కేంద్ర బృందం పరిశీలన..

తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు మార్చి 20, 21 తేదీల్లో మొదటగా పరిశీలించారు. ప్రధానంగా ఆరోగ్య కేంద్రంలో 14 జాతీయ వైద్య సేవలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్, జనరల్ వార్డు, లేబర్‌వార్డు, డెలివరీ రూం, ఫార్మసీ అనే ఆరు అంశాలపై పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. వారు నిర్వహించిన సర్వే ఆధారంగా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. జిల్లాల విభజన కాకముందు కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2016-17లో కాయకల్ప అవార్డులో మొదటి స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది.

బాగా చూస్తున్నారునేను వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చాను. ఇక్కడ అన్ని వసతులున్నాయి. వైద్యులు బాగా చూస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. పెద్దాసుపత్రి మాదిరిగానే ఇక్కడ కూడా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సేవలు అందుతున్నాయి.లక్ష్మి, మండెపల్లి

ప్రతి ఒక్కరి కృషి వల్లే..

జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడం వల్లే ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. ప్రధానంగా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శ్రద్ధ, జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణతో సిబ్బంది బాగా పని చేశారు. ఫలితంగా 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీని వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉంది. ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ.9 లక్షలను కేంద్రం ప్రోత్సాహకంగా అందించనుంది.శ్రీరాములు, ప్రోగ్రాం అధికారి

బాధ్యత మరింత పెరిగిందినేను ఇక్కడికి వచ్చి నాలుగు నెలలు అవుతుంది. ఇక్కడ రోగులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. రోజూ 60 నుంచి 70 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇదే స్ఫూర్తితో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తాం.జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడం వల్లే ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. ప్రధానంగా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శ్రద్ధ, జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణతో సిబ్బంది బాగా పని చేశారు. దీని వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉంది. స్నేహ, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

# పరిశ్రమపైనే రైతుల ఆశలు

మల్లాపూర్ : ఉమ్మడి జిల్లాలో ఏకైక వ్యవసాయ ఆధారిత కర్మాగారం ముత్యంపేట చక్కెర పరిశ్రమ. గతంలో 5 వేల మంది రైతు కుటుంబాలకు లాభాలను పంచిపెట్టి, 2 వేల మంది కార్మికులకు ఉపాధినిచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించింది. కూలీలకు జీవనోపాధి అందించండంతో పాటు పరోక్షంగా వేలమందికి జీవనోపాధి కల్పించింది. 32 సంవత్సరాల పాటు నిరాటంకంగా నడిచిన పరిశ్రమను లేఆఫ్ కారణంగా 2015-16 సీజన్‌లో ప్రభుత్వం మూసివేసింది. దీంతో లాభాలను కోల్పోయి రైతులు, ఉపాధి కరవై కార్మికులు పరిశ్రమను తెరిపించడానికి ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టే ప్రభుత్వాలు పరిశ్రమను తెరిపిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

అనుబంధ పరిశ్రమలతో ప్రయోజనం

ముత్యంపేట చక్కెర పరిశ్రమలో అనుబంధ ఉత్పత్తులు ప్రారంభిస్తే పరిశ్రమ లాభాల బాట పడుతందని రైతులు పేర్కొంటున్నారు. పరిశ్రమ పరిధిలో వందల ఎకరాల బీడు భూములు ఉన్నాయి. దీంతో పాటు నీటి వసతి పుష్కలంగా ఉంది. ఇలాంటి పరిస్థితులలో పేపరు తయారీ, మినరల్ వాటర్, విద్యుత్తు ఉత్పత్తి, మద్యం తయారీ వంటి వాటిని ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమను కాపాడుకోవచ్చని, దీనిపై ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసి సాధ్యసాధ్యాలను పరిశీలించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు పరిశ్రమను ప్రారంభించినా 4 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా చెరకును పండించగలమని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమను ప్రభుత్వం నడిపించినా, ప్రైవేటుకు అప్పగించిన తమకు అభ్యంతరం లేదని, తిరిగి ప్రారంభిస్తే చాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రతిపక్ష పార్టీల సంఘీభావం

మూసివేసిన పరిశ్రమను తెరిపించేవరకు రైతులకు అండగా ఉంటామని భాజపా, కాంగ్రెస్, తెజస, వైఎస్సార్‌టీపీ అధ్యక్షులు పేర్కొన్నారు. పరిశ్రమలకు సముచిత స్థానం కల్పిస్తామని ప్రతిపక్ష పార్టీల నాయకులు హామీ ఇస్తున్నారు. దీంతో పరిశ్రమను తెరిపించే పార్టీకి అండగా ఉండాలని రైతులు నిర్ణయం తీసుకుంటున్నారు.

ఉద్యమాల ద్వారానే సాధ్యం..మూసివేసిన పరిశ్రమను తెరిపించుకునేందుకు ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సహకార సంఘం ద్వారా పరిశ్రమను నడిపించేందుకు రైతులు అంగీకరించడం లేదు. ముత్యంపేట పరిశ్రమ పరిధిలో పండిస్తున్న చెరకును కామారెడ్డిలోని గాయత్రీ షుగర్స్‌కు తరలించడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం వెంటనే పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని రైతులందరి తరపున కోరుతున్నా.

# సత్య మార్గం.. ఉపాధికి ఊతం

ఖమ్మం : నలుగురికీ ఉపయోగకరంగా నిలవాలనే ఉద్దేశంతో ఖమ్మంలో ఓ మహిళ పాతికేళ్ల కిందట నెలకొల్పిన 'సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ' నేడు వేలాది మందికి అండగా నిలబడింది. వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో జన్మించిన సరిదే శ్రీలక్ష్మి ఖమ్మానికి చెందిన నగేశ్‌ను వివాహం చేసుకుని నిజాంపేటలో స్థిరపడ్డారు. 2001లో సేవా రంగంలోకి ప్రవేశించిన ఆమె 2007లో 'సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ'ని ప్రారంభించారు. నాటి నుంచి వేలాది మందికి పలు వృత్తుల్లో ఉచిత శిక్షణ అందించారు. శిక్షణ పొందిన మహిళలు ప్రస్తుతం ఆయా రంగాల్లో స్థిరపడి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహింది, బ్రైడల్ శారీ ప్రీ ఫోల్డింగ్, అగర్‌బత్తీల తయారీ, దుస్తులు ఉతికే, గిన్నెలు కడిగే, ఇల్లు తుడిచే రసాయనాల తయారీ, కాగితం సంచుల తయారీలో శిక్షణ అందిస్తున్నారు.

ఖమ్మం జిల్లా జైలులో మహిళా ఖైదీలకు 45 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా జైలులో ఖైదీలకు 3 రోజులపాటు కాగితం సంచుల తయారీలో శిక్షణ అందించారు. అత్యాచారానికి గురై ధగా పడిన యువతులు, మహిళలకు భరోసా కేంద్రాల్లో కుట్టు శిక్షణ, కాగితం సంచుల తయారీలో శిక్షణ అందించారు. సంస్థ పనితీరును గుర్తించి సీపీ విష్ణువారియర్ ఈ అవకాశం కల్పించారు. నిరుద్యోగ యవకులకు లాజిస్టిక్స్‌లో శిక్షణ ఇవ్వగా వారిలో చాలా మందికి విజయవాడ, ఖమ్మం, వరంగల్ ఎఫ్‌సీఐ గోదాముల్లో హమాలీలుగా ఉపాధి అవకాశం దక్కింది. ఖమ్మం, చింతకాని, ఖమ్మం



గ్రామీణం, బోనకల్లు, రఘునాథపాలెం మండలాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది నేర్చుకునే చోటే కేంద్రం ఏర్పాటు చేస్తారు. అవార్డులు, రివార్డులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యమార్గం నిర్వాహకురాలు శ్రీలక్ష్మిని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సత్కరించారు. కోల్‌కతాలోని స్వామి వివేకానంద, సిస్టర్ మార్గరేట్ '2019–20' అవార్డును సిస్టర్ మార్గరేట్ ఫౌండేషన్ ప్రకటించింది. 2020 ఫిబ్రవరి 20న పశ్చిమ బంగా గవర్నర్(ప్రస్తుత ఉప రాష్ట్రపతి) జగ్‌దీప్ ధన్‌కర్ నుంచి శ్రీలక్ష్మీ అవార్డు అందుకున్నారు. అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ శ్రీలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేయగా, బెంగళూరులో 2020 జూన్ 20న అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఉమెన్ ఎంపవర్‌మెంట్–2019 అవార్డుకు ఎంపిక చేసి బహూకరించారు. %http://www.sathya margam.com% వెబ్‌సైట్‌లో తమ సంస్థ సేవా కార్యక్రమాలు పూర్తిగా తెలుసుకోవచ్చని, తమని సంప్రదించవచ్చని వివరించారు.

సొంత సొమ్ముతో...పలు వృత్తుల్లో శిక్షణ అందించే శిక్షకులకు సొంత డబ్బు జీతంగా ఇస్తున్నారు. తన ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్లు ప్రతినెలా అందించే ఆర్థిక సాయంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇక్కడ సేవలందించేందుకు 300 మంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు సహా వేర్వేరు రంగాల్లోని వారు సంస్థకు సమయం కేటాయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కౌశల్ యోజన, స్కిల్ డెవలప్‌మెంట్, రాజీవ్ యువ కిరణాలు, మెప్మా, డీఆర్డీఏ పథకాలను ఆసరా చేసుకుని నిరుద్యోగులకు పలు రంగాల్లో శిక్షణ అందించి ఉపాధి మార్గం చూపుతున్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో వందల మందికి ఉచితంగా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వినాయక చవితికి మట్టి, విత్తన గణపతులు తయారు చేయించి పంచుతున్నారు. ఖమ్మంలోని కేవీఎం పాఠశాలలో 9 ఏళ్లుగా ఉచితంగా నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ముందు 3 నెలలు అల్పాహారం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నారు.

## జీవన కళ.. సృజన భళా

పాల్వంచ : కళలు బాలల నేస్తాలు. ఆసక్తి ఉన్నకళల్లో రాణించే వారి ఆలోచనా దృక్పథం భిన్నంగా ఉంటుంది. సృజనాత్మక ఆలోచనలు మెరుగైన జీవనశైలికి దోహదపడేలా చేస్తాయి. కళల్లో సిద్ధహస్తులైన వారికి ప్రపంచాన్ని సామాజిక కోణంలో చూడగలిగే భిన్న పార్శ్వం, నైపుణ్యాలు అలవడుతాయంటారు. ఈ క్రమంలో కేవలం చదువుకే పరిమితమైన నేటి విద్యార్థులను కళల దిశగా ప్రోత్సహించేందుకు 'సాంఘిక', 'గిరిజన సంక్షేమ', ఏకవల్య గురుకులాల నిర్వాహకులు ప్రత్యేక కృషిచేస్తున్నారు. పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెంలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకులం వేదికగా 'స్పార్కిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 22న ప్రారంభించిన వేసవి శిక్షణ శనివారంతో ముగియనుంది. జిల్లాలోని 9 విద్యాలయాలకు చెందిన 6 – 10వ తరగతుల బాలురు 200 మంది హాజరయ్యారు. ఏడుగురు కళాకారులు, నిపుణులు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు శిక్షణ ఇచ్చారు. ఏర్పాట్లను విద్యాలయ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఏం నేర్చుకున్నారంటే... థియేటర్ ఆర్ట్స్: ఇద్దరు ట్రైనర్లు ప్రతిరోజు నైపుణ్యాలు నేర్పించారు. రంగస్థల నటన, స్క్రిప్ట్ రైటింగ్, ఎడిటింగ్, అనువాదం, అడాప్టింగ్, సెట్ డిజైనింగ్, లైటింగ్, ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లేయింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, సౌండ్ ఎఫెక్ట్స్, మేకప్, ప్రొడక్షన్, దర్శకత్వం గురించి వివరించారు. ఏకపాత్రాభినయం, నవరసాలు పలికించడంపై తర్ఫీదు ఇచ్చారు. చిత్రలేఖనం: భావాలను దృశ్యరూపకంగా చాటే కళ ఇది. ఏదైనా విషయంపై సృజనాత్మక శక్తితో అద్భుత చిత్రాలు ఎలా తీర్చిదిద్దాలో వివరించారు.

యాంకరింగ్, పబ్లిక్ స్పీకింగ్: తమ భావాలను వాక్చాతుర్యంతో, ప్రస్ఫుటంగా, ధైర్యంగా నలుగురిలో చెప్పగలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. నాయకత్వ లక్షణాలు ఎలా పుణికిపుచ్చుకోవాలో నిపుణులు వివరించారు.

సంస్కృతం: ఇది.. వేదభాష. ఇతిహాసాలు, పురాణాలన్నీ రచించింది సంస్కృతంలోనే. తరతరాల సంస్కృతికి వారధి. ఈ భాషపై పట్టు సాధించే వారికి దేశ సంస్కృతిపై ఎలా విస్తృత అవగాహన పెంపొందుతుందో తెలిపారు. అక్షరమాల, వ్యాఖ్య రచనపై పట్టుసాధించేలా శిక్షణ ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు వేసవి శిక్షణలకే పరిమితం కారాదన్నది తల్లిదండ్రుల ఆకాంక్ష. పాఠశాలల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధతో నైపుణ్యాలు అలవర్చాలని కోరుతున్నారు.

సృజనాత్మకత చాటేందుకు చక్కని వేదిక

విద్యార్థులకు చదువొక్కటే ప్రపంచం కాదు. వారు రాణించడానికి థియేటర్ ఆర్ట్స్ చక్కని వేదికగా నిలుస్తాయి. మేధస్సుకు పదును పెడితే ఏజెన్సీ విద్యార్థులు అద్భుతాలు సృష్టించగలరు. స్టేజీ భయం లేకుండా, నవరసాలు పలికించేలా, ఏకపాత్రాభినయంలో రాణించేలా చిన్నారులను తీర్చిదిద్దాం. ఇలాంటి శిక్షణలు బాలలకు ఎంతోమేలు చేస్తాయి. ఆకుల రోహిత్‌రాజ్, థియేటర్ ఆర్ట్స్ ట్రైనర్ చిన్నప్పట్నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. మొన్నటి వరకు శిక్షణ తీసుకోలేకపో యా. తాజా శిబిరంలో గురువులు మెలకువలు నేర్పించారు. శ్రద్ధాసక్తులతో నైపుణ్యాలు ఒంటబట్టించుకున్నా. గతం కంటే ఎంతో మిన్నగా చిత్రాలు వేయగలుగుతున్నా. నిరంతర సాధన కొనసాగిస్తా. బందెల శ్వేతన్, మణుగూరు విద్యార్థి

# మాయా మశ్చీంద్ర



వైరా : రాష్ట్ర స్థాయిలో కొరమీను చేప పిల్లలను ఉత్పత్తి చేయాల్సిన ఏకైక మత్స్య విత్తన కేంద్రం వైరా. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల స్థాయిలో తెల్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే కేంద్రమూ ఇదే. మత్స్య శాఖకు గుండెకాయ లాంటి డివిజన్. అపార జలపుష్ప సంపద.. వేల సంఖ్యలో మత్స్యకారులున్న కేంద్రంలో ఆ సంపద చేతికొచ్చే తరుణం ఇది.. చేపపిల్లల ఉత్పత్తికి ఏర్పాట్లు చేసుకోవాల్సిన సమయమూ ఇదే. కీలక సమయంలో చూద్దామన్న సిబ్బంది కనిపించటం లేదు.. పర్యవేక్షణ లేమితో నష్టం వాటిల్లేలా ఉన్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం విశేషం.

కొరమీను ఉత్పత్తి ఎలా?రాష్ట్రంలో కొరమీను చేపపిల్లల ఉత్పత్తికి వైరాను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. కరోనా ముందు నుంచి ఈ ప్రక్రియ నడుస్తుండగా గత సీజన్‌లో మాత్రమే వీటి ఉత్పత్తి విజయవంతమైనట్లు అధికారులు ప్రకటించారు. అతి కష్టంగా గత సీజన్‌లో 50వేల పిల్లలు ఉత్పత్తి చేయగా అందులో 1500 పిల్లలు మాత్రమే 5 అంగుళాల పరిమాణం వరకు ఎదిగినట్లు మత్స్య శాఖ నివేదిక ప్రకటించింది. ఈసారి ఇంకా ఎక్కువ ఉత్పత్తి చేయాలని నిర్ణయించగా ఆ పరిస్థితి లేదు. వర్షాకాలం ఆరంభం జూన్ నాటికే ప్రక్రియ గాడినపడాలి. గత సీజన్‌లో సిఫా శాస్త్రవేత్తల పర్యవేక్షణలో భాగంగా శిక్షణ పొందిన ఎఫ్‌డీవో, ఫిషరీస్ అసిస్టెంట్‌లు ఇద్దరిపైనా వేటుపడింది. దీంతో ఉత్పత్తి పూర్తి ప్రశ్నార్థకంగా మారింది.

ఇదీ పరిస్థితి

కొద్ది నెలలుగా జిల్లా మత్స్య శాఖ పరిస్థితి పూర్తిగా మసకబారింది. గత డిసెంబరులో వైరా కార్యాలయం వేదికగా అవినీతి అంశాలపై ఏసీబీ సోదాలు చేసింది. దాడుల నేపథ్యంలో ఎఫ్‌డీవో బుజ్జిబాబును సస్పెండ్ చేయగా ఫిషరీస్ అసిస్టెంటు మురళీని విధుల నుంచి పూర్తిగా తొలగించారు. అనంతరం ఎఫ్‌డీవో పోస్టులో మరొకరిని నియమించలేదు. ఖమ్మం జిల్లా అధికారి(ఏడీ)కి ఇన్‌ఛార్జ్ బాధ్యతలప్పగించారు. ఇక్కడ నాలుగైదు నెలల నుంచి కార్యకలాపాలన్నీ కుంటుపడ్డాయి. సీజన్ సమీపిస్తున్నా చక్కదిద్దే పరిణామాలు కనిపించటం లేదు.

కోటి ఉత్పత్తి లక్ష్యం

వైరా మత్స్య విత్తన క్షేత్రంలో ఏటా కట్ల, రోహు, మృగాల, బంగారుతీగ చేప పిల్లలను ఉత్పత్తి చేయాలి. జూన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాలి. అన్ని రకాలు కలిపి మొత్తం కోటి పిల్లల (చిచ్చురు... గుడ్డు నుంచి బయటకు వచ్చే దశ) ఉత్పత్తి లక్ష్యం ఇప్పటికే విధించారు. వీటిని రేరింగ్ ద్వారా 30 లక్షల పిల్లలను (30 అంగుళాల పరిమాణంలో) మత్స్య సంఘాలకు అందించాలని నిర్ణయించారు. లక్ష్యంలో భాగంగా పది లక్షల చిచ్చురు చేపపిల్లలను పాల్వంచ కిన్నెరసానిలో పెంపకం కేంద్రానికి అప్పగించాలనే నిబంధన ఉంది. అక్కడ సైతం వీటిని రేరింగ్ చేపట్టాలి. మరో 13 లక్షల బంగారుతీగ చిరు చేపలను ఉత్పత్తి చేసే బాధ్యతా వైరా డివిజన్‌దే. దీనికోసం స్థానిక మత్స్య కేంద్రంలో సిమెంటు, మట్టి కొలనులున్నాయి. వీటి నిర్వహణ ఇప్పటికే ప్రారంభించాలి. పైపులైన్లు, హేచరీస్, ఇతర విభాగాలు సిద్ధం చేయాలి. కానీ అవేమీ ప్రస్తుతం కనిపించటం లేదు. అధికారులకు నివేదించాం..

ఆంజనేయస్వామి, మత్స్య శాఖ ఏడీ...వైరా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో పనిభారం ఉంది. కొరమీను ఉత్పత్తికి ప్రయోగాత్మక కేంద్రమిది. సాధారణ చేపపిల్లలు కోటి వరకు ఉత్పత్తి చేయాలి. వీటి పర్యవేక్షణకు ఖాళీలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరాం. ప్రస్తుతానికి ఇక్కడ ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్‌ను తాత్కాలికంగా నియమించాం. సాధ్యమైన మేరకు ఉత్పత్తిని సజావుగా చేసే ప్రయత్నాలు చేస్తున్నాం.

# ఆరోగ్య మిత్రులేరి..



ఖమ్మం : 2008లో ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభ సమయంలో పొరుగు సేవల విభాగంలో ఆరోగ్య మిత్రలను నియమించారు. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందించేలా విధులను నిర్దేశించారు. పీహెచ్‌సీల పరిధిలో ఉండే ఆరోగ్య మిత్రలు రోగుల సమస్యలు తెలుసుకునేవారు. వైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లి వైద్యం అందే వరకు వెన్నంటి ఉండేవారు. చికిత్స పూర్తయిన తర్వాత సహకారం అందించేవారు. కొన్నేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మిత్ర సేవలు అందుబాటులో లేవు. ప్రస్తుతం ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులకే వారు పరిమితమయ్యారు. వాటిల్లోనూ ప్రస్తుత అవసరాలకు, వీరి సంఖ్యకు పొంతన లేదు. దీంతో పనిభారం అధికమై మిత్రలు, సకాలంలో సేవలందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

సమస్య ఏంటి?ప్రాథమిక స్థాయిలో ఆరోగ్య మిత్రలు లేకపోవటంతో సామాన్య ప్రజలకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలపై మార్గనిర్దేశం సరిగ్గా అందటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతోన్న ఆయుష్మాన్ సేవల కోసం పీహెచ్‌సీలకు వెళ్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకోపక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో 2 లక్షల తెల్ల రేషను కార్డులుండేవి. ఇప్పుడు ఒక్క ఖమ్మం జిల్లాలోనే 3లక్షల తెల్ల కార్డులు, భద్రాద్రి జిల్లాలో మరో 3లక్షలున్నాయి. వీరందరికి ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలందించడానికి ప్రస్తుతం ఉన్న 70మంది ఏ మాత్రం చాలటం లేదు. అదనంగా మరో 100 మంది అవసరమవుతారంటే అతిశయోక్తి కాదు.

మచ్చుకు కొన్ని... ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన స్థాయిలో ఆరోగ్య మిత్రలు లేకపోవడంతో రోగులకు ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీ సేవలు ఆశించిన స్థాయిలో లభించడం లేదు. సత్తుపల్లి సీహెచ్‌సీలో ఐదుగురు ఉండాలి. ముగ్గురే ఉన్నారు. ఇక్కడ డయాలసిస్ కేంద్రం కూడా పనిచేస్తుంది. మధిర సీహెచ్‌సీలో ముగ్గురు ఆరోగ్య మిత్రలు పనిచేయాలి. ఒక్కరు మాత్రమే సేవలందిస్తున్నారు. నేలకొండపల్లి సీహెచ్‌సీలో ముగ్గురికి ఒక్కరు, తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో కూడా ఒక్కరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కల్లూరు సీహెచ్‌సీలో ఇద్దరి పని ఒక్కరే చేస్తున్నారు.

పెనుబల్లి సీహెచ్‌సీలో ముగ్గురు ఉన్నారు. త్వరలో డయాలసిస్ కేంద్రం రానుంది. సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది.

చాలీచాలని వేతనాలతో..

ఆరోగ్యశ్రీ కొత్తలో రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది ఆరోగ్య మిత్రలు ఉండేవారు. వారిలో ఎక్కువ శాతం పోస్టు గ్రాడ్యుయేట్ చదువుకున్నవారే. అందులో చాలామంది వేతనం చాలక వేరే ఉద్యోగాలకు తరలివెళ్లారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది మాత్రమే ఉన్నారు. వీరికి రూ.15వేలు వేతనం చెల్లిస్తున్నారు. వాటిల్లో రూ.13వేలు చేతికందుతున్నాయి. చాలీచాలని వేతనాలకు తోడు ప్రభుత్వం నిర్దేశించే లక్ష్యాలతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. ప్రతి ఆరోగ్య మిత్ర ప్రతి నెలా వంద కేసులను ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 70 మంది..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో 126 మంది ఆరోగ్య మిత్రలు ఉండేవారు. ప్రస్తుతం 70 మంది పనిచేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 14, ఖమ్మం జిల్లాలో 18 వెరసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 32 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. వాటిల్లో మాత్రమే ప్రస్తుతం వీరు పనిచేస్తున్నారు. పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో లేరు. ఒకప్పుడు రోగికి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు మధ్య ఆరోగ్య మిత్రలు అనుసంధానంగా ఉండేవారు. ఇప్పుడు ప్రభుత్వానికి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు అనుసంధానంగా పని చేస్తున్నారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి రోగులను నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపే ప్రక్రియలో ఆరోగ్య మిత్రల అవసరం ఎంతో ఉంది. చాలామంది ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సేవల కోసం నెట్‌వర్క్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. అక్కడి మిత్రలు సేవలందిస్తున్నారు. వారి సంఖ్య పెంపుపై ప్రభుత్వానికి నివేదించాం."పి.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

## 555 శిథిల క్వార్టర్ల కూల్చివేతకు నిర్ణయం

కొత్తగూడెం : సింగరేణిలో పనిచేసే ఉద్యోగులకు అన్ని సదుపాయాలతో కూడిన క్వార్టర్లు కేటాయించేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతుంది. కొత్తగూడెం ఏరియాలో ఏడెనిమిది దశాబ్దాల క్రితం పలు క్వార్టర్లు నిర్మించగా.. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కొన్ని నివాసాల్లో మొన్నటిదాకా కార్మిక కుటుంబాలు నివసించాయి. మరికొన్ని సరైన మరమ్మతులకు నోచుకోలేదు. నిర్లక్ష్యానికి గురైన నివాసాల్లో కలప, ఇనుము వంటి సామగ్రిని చోరులు ఎత్తుకెళ్లడం షరామామూలైంది. రెండంతస్తులతో నిర్మించిన 'టీ2' రకం క్వార్టర్ల కాలం కూడా చెల్లుతోంది. చాలావరకు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి వెంటనే తొలగించేందుకు అధికారులు నిర్ణయించారు. స్థానిక ఏరియాలోని రుద్రంపూర్, ధన్‌బాద్, త్రీఇంక్లైన్, రామవరం, గౌతంపూర్ ప్రాంతాల్లో మొత్తంగా 555 క్వార్టర్లు నివాసయోగ్యంగా లేవని గుర్తించారు. యాజమాన్యం అనుమతితో ఏరియా అధికారులు పలు దఫాలుగా కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 107 నేలమట్టం చేశారు. మరో 18 క్వార్టర్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు మూడ్రోజుల్లో ఈ పనులు పూర్తవనున్నాయి. ఆక్రమణలపైనా దృష్టిశిథిలమైన వాటిలో మరో 430 క్వార్టర్లు తొలగించేందుకు యాజమాన్యం తాజా జాబితా సిద్ధం చేసింది. వీటిల్లో టీ 2 రకానికి చెందిన వాటితో పాటు ఎంబీ, ఎంసీ రకం నివాసాలున్నాయి. తొలుత రామవరం, ధన్‌బాద్, త్రీఇంక్లైన్ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నారు. చాలా వరకు నివాసయోగ్యంగా లేకపోగా, కొన్నింటిలో కార్మికేతరులు తలదాచుకుంటున్నారు. తొలగించాలని నిర్ణయించిన నివాసాలను రెండేళ్లుగా కార్మికులకు కేటాయించకుండా మినహాయించారు. అప్పటి నుంచి అవి ఖాళీగా ఉండటంతో ఇతరులు నివాసముంటున్నారు. త్వరలో ఉన్నతస్థాయి అధికారుల సమావేశం అనంతరం.. ఆక్రమణలకు గురైన క్వార్టర్లనూ తొలగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌ల సరఫరా

ములుగు : విద్యాశాఖలో పరిస్థితులు మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు నమోదుకు బయోమెట్రిక్ యంత్రాలను ప్రవేశపెట్టగా.. పాఠశాలలోని ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కొత్తగా ట్యాబ్‌లను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలకు ప్రముఖ కంపనీకి చెందిన ట్యాబ్‌లను ప్రభుత్వం సరఫరా చేసింది. ఒక్కో ట్యాబ్ ఖరీదు సుమారు రూ. 20 వేల వరకు ఉంటుందనేది అంచనా. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు వీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. పది మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలను ఎంపిక చేసి సరఫరా చేశారు. విద్యాశాఖ లెక్కల ప్రకారం ములుగు జిల్లాలో మొత్తం 264 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఈ సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మొత్తం 266 ట్యాబ్‌లను సరఫరా చేసింది. ప్రస్తుతం ఇవి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు వీటిని పాఠశాలలకు అందించాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించి పరీక్షించిన తర్వాత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించనున్నారు.



అంతర్జాలంలో వివరాల నమోదు

ట్యాబ్‌లలో పాఠశాలలకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయనున్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన వివరాలు, పిల్లల సంఖ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మార్కుల వివరాలు, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు, కొత్త విద్యార్థుల ప్రవేశాలు లాంటి కార్యక్రమాల వివరాలు పొందుపర్చనున్నారు. దాంతో పాటు ఆన్‌లైన్ తరగతులకు కూడా ఉపయోగపడనున్నాయి. గతంలో యూడైస్ లాంటి వివరాలు పాఠశాల నుంచి లిఖితపూర్వకంగా సమర్పించిన తర్వాతనే తుది జాబితా సిద్ధం చేసేవారు. దీని ద్వారా పాఠశాలకు సంబంధించి ప్రతి అంశం నేరుగా ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరనుంది. పాఠశాల ప్రారంభానికి ముందే అందిస్తాం..రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలల ప్రారంభానికి ముందే వాటిని సరఫరా చేస్తాం. ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించనున్నాం. జి.పాణిని, జిల్లా విద్యాశాఖ అధికారి

## ధర ఒక్కటే.. చెల్లింపుల్లోనే తేడా!

ములుగు : విత్తు నాటింది మొదలు.. పంట అమ్మే వరకు రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొస్తే అక్కడా దగా పడుతున్నారు.. కోత.. కమీషన్ల పేరిట విక్రయసొమ్ము చెల్లించే సమయంలో వ్యాపారులు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట ఉండడంలేదు. ప్రస్తుతం రైతులు పత్తి, మిర్చి, వరి, మొక్క జొన్న పంటలను విక్రయించేందుకు మార్కెట్లకు వస్తున్నారు. ఈ–నామ్ రాకతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనుకున్న అన్నదాతకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్, జనగామ, నర్సంపేట, పరకాల, వరంగల్ మార్కెట్లలో ఈ– నామ్ విధానం అమలవుతోంది. ఆరేళ్లు దాటినా ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల హవానే నడుస్తోంది. ఈనామ్ పూర్తిస్థాయిలో అమలైతే కూలీ ఛార్జీలు తప్పితే ఒక్కపైసా ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ–నామ్ అమలు చేస్తున్నామని చెబుతున్న మార్కెట్లలో కేవలం టెండర్లకు మాత్రమే పరిమితం కావడంతో దోపిడీ ఎప్పటిలాగే కొనసాగుతోంది..కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఇచ్చిన లాట్ ఐడీ చూపుతున్న ఈ రైతు కేసముద్రం మండలం క్యాంపుతండాకు చెందిన ధరంసోతు రాంచంద్రు. ఏప్రిల్ 27న కేసముద్రం మార్కెట్‌కు 40 బస్తాల మిర్చి తీసుకెళ్లారు. క్వింటాలుకు రూ.18,669 ధర పలికింది. గిట్టుబాటు కాకపోవడంతో అక్కడి నుంచి 28న మహబూబాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లగా అక్కడ క్వింటాలుకు రూ.19,800 ధర ఉంది. కేసముద్రం నుంచి మహబూబాబాద్ మార్కెట్‌కు మిర్చి బస్తాలు తరలించడానికి రవాణా ఖర్చులు రూ.1500 వెచ్చించారు. కేసముద్రం మార్కెట్‌లో రెండు రోజులు పడిగాపులు పడాల్సి వచ్చింది. కేసముద్రం మార్కెట్‌లో కమీషన్ పేరిట రూ.100కు రూ.3 కోత పెడుతున్నారు. మహబూబాబాద్ మార్కెట్‌లో ఇది రూ.2 గా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నగదు పేరిట..రాష్ట్రంలో 192 వ్యవసాయ మార్కెట్లు ఉండగా అందులో 57 మార్కెట్లలో ప్రస్తుతం ఈ–నామ్ అమలు చేస్తున్నారు. ఇందులో కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లలో మాత్రం ప్రత్యక్ష విధానం అమల్లో ఉండటంతో కమీషన్ కోత ఉండదు. వరంగల్ వంటి ఇతర మార్కెట్లలో అడ్తీ విధానం ఉండటంతో నిబంధనల ప్రకారం 2 శాతం అడ్తీ కమీషన్ కోత పెట్టుకోవచ్చు. క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఒప్పందాలు చేసుకొని దోపిడీ కొనసాగిస్తున్నారు. వరంగల్ మార్కెట్‌లో నిబంధనల ప్రకారం నూటికి 2 శాతం కోత విధించాలి. నగదు చెల్లింపులు ఇతర కారణాలు చూపుతూ నూటికి 4 శాతం నుంచి 5 శాతం కోత విధిస్తున్నారు. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్లలో మిర్చి అమ్మకాలకు స్థానికంగా ఒప్పందం చేసుకుని 3, 2 శాతం చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలిప్రస్తుతం మిర్చి పంటకు 2 శాతం, నగదు చెల్లింపు పేరుతో 1శాతం కోత విధిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఈ–నామ్ అమలు చేసి ఎలాంటి కోత లేకుండా సరకు విక్రయించిన వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలి.

రాంజీనాయక్, కోమటిపల్లి, కేసముద్రం

నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ కటింగ్15 రోజుల కిందట వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో 22 క్వింటాళ్ల మిర్చి విక్రయించాను. క్వింటాలుకు రూ.32 వేలు పలికింది. నిబంధనల ప్రకారం అడ్తీ కమీషన్ 14,080 కోత విధించాల్సి ఉంది. రూ.28,160 తీసుకున్నారు. అదనంగా కమీషన్ కోతపై ప్రశ్నిస్తే అన్ని మార్కెట్లలో ఇలాగే ఉందని చెప్పారు. కాటిపల్లి వెంకట్రావు, మేడిపల్లి, జగిత్యాల జిల్లాపూర్తిస్థాయిలో అమలు చేస్తాంత్వరలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మార్కెట్‌లలో పూర్తి స్థాయిలో ఈ–నామ్ విధానం అమలు చేస్తాం. వరంగల్ మార్కెట్‌లో 2 శాతం మాత్రమే అడ్తీ కమీషన్ తీసుకోవాలి. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్లలో ఎలాంటి కమీషన్ కోత విధించొద్దు.

# ఆరంభ శూరత్వం.. ఆఖరులో అలసత్వం

ఆదిలాబాద్ : జిల్లాలో రైల్వే పై వంతెనల కష్టాలు తీరడం లేదు. నిధులు మంజూరై.. పనులు ఆరంభంలో వేగంగా జరిగాయి. చివరిలో జరుగుతున్న జాప్యంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కరోనాతో రెండు సంవత్సరాలు ఆలస్యం కాగా ఇప్పుడు రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండటంతో నాలుగేళ్ల క్రితం పూర్తికావాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. తెలంగాణ- మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దులోని కాగజ్‌నగర్- సిర్పూరు(టి) ప్రధాన రహదారి మధ్య వేంపల్లి రైల్వేగేటు వద్ద రైల్వే పై వంతెన లేక ప్రజలు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. కాజీపేట- బల్లార్షా ప్రధాన రైల్వే మార్గంలో రోజుకు దాదాపు 52 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అరగంటకు ఒకసారి వేంపల్లి రైల్వే గేటు పడుతోంది. దీంతో బెజ్జూరు, కౌటాల, సిర్పూరు(టి) మండలాల వాసులతోపాటు, కాగజ్‌నగర్ నుంచి ఆ మండలాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజల కష్టాలను గుర్తించి వంతెన మంజూరు చేసినా పనుల్లో జాప్యంతో మోక్షం కలగడం లేదు.

గడువు ఎప్పుడో ముగిసింది..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా



రైల్వేపై వంతెన నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేస్తూ జీఓ.నెం.328, 30-07-2015న విడుదల చేశాయి. పనులకు రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో టెండర్లు పిలవగా ఎం.ఎస్.కేవీఆర్ కన్‌స్ట్రక్షన్, హైదరాబాద్ సంస్థ దక్కించుకుంది. రైల్వే వంతెన పనులను తేదీ 13-01-2016 నుంచి 18-01-2018 అంటే రెండేళ్లలో పూర్తి చేయాలి. గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు గడిచింది. రోడ్లు భవనాల శాఖ పరిధిలోని ఇరువైపులా వంతెన పనులు పూర్తి కాగా, రైలు పట్టాలపై రైల్వే ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు పూర్తి కావాల్సి ఉంది.

మెట్ల నిర్మాణం మరిచారు..

2005-06లో అప్పటి ప్రభుత్వ హయాంలో కాగజ్‌నగర్ పట్టణంలోని మహాత్మాగాంధీ రహదారి రైల్వే పట్టాలపై రైల్వే పై వంతెన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.17 కోట్లు మంజూరు చేశాయి. ఈ నిధులతో రైల్వే పై వంతెనతోపాటు, వంతెనపై పాదచారుల సౌకర్యార్థం ఎడమ, కుడివైపు మెట్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. టెండర్లు పొందిన గుత్తేదారు 2014 డిసెంబర్‌లోనే రైల్వే పైవంతెన నిర్మాణం పూర్తి చేశారు. కానీ పాదచారుల కోసం మెట్ల నిర్మాణం చేపట్టలేదు. అనంతరం 2015 జనవరి 27న పనులు చేపట్టారు. రైల్వే పైవంతెన మధ్యలో ఇరువైపులా కుడి, ఎడమ వైపు రెండుచోట్ల నిర్మాణం కోసం స్థలం వదిలేశారు. రూ.8 లక్షల వరకు నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. కానీ గుత్తేదారు ఈ మెట్ల పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రోడ్డు భవనాలశాఖ అధికారులు సదరు గుత్తేదారుకు పలుమార్లు శ్రీముఖాలు జారీ చేసినా స్పందన లేదు.త్వరలో పూర్తి చేస్తాం- లక్ష్మీనారాయణ, డీఈ, రోడ్లు, భవనాల శాఖసిర్పూర్(టి)- వేంపల్లి వంతెనలో మా పరిధిలోని పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. రైల్వేకు సంబంధించిన పనులు పూర్తి కావాల్సి ఉంది. కాగజ్‌నగర్ రైల్వే పైవంతెన మెట్లను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

# విత్తన దశలోనే సోయా రైతు చిత్తు



ఆదిలాబాద్ : విత్తు దశలోనే సోయా రైతులు చిత్తవుతున్నారు. రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తి వారమైనా మొలకలు రాకపోవడంతో నాణ్యతపై వారిలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ సీజన్‌లో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ప్రైవేట్ విత్తనాలపై ఆధారపడ్డారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది వ్యాపారులు మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలు తీసుకొచ్చి ఇష్టమొచ్చిన ధరతో విక్రయించారు. వాటిలో కొన్ని రకాలు మొలకెత్తక బాధిత రైతులు దుకాణాల ఎదుట ఆందోళన చేపట్టడంతో అధికార యంత్రాంగం కదిలింది. ఇందులో భాగంగా శుక్రవారం పంట పొలాల్లో సోయా విత్తనాన్ని శాస్త్రవేత్తల బృందం పరిశీలించనుంది.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తే.. ఏటా 90 వేల ఎకరాలకు పైగా సోయా సాగవుతుంది. గతేడాది సోయాకు మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభించడంతో ఈ సీజన్‌లో అటువైపే మొగ్గు చూపారు. విత్తనాలు ఇక్కడ దొరక్క కొందరు మహారాష్ట్రకు వెళ్లి తెచ్చుకున్నారు. డిమాండ్‌ను చూసిన స్థానిక వ్యాపారులు వందల క్వింటాళ్ల విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయించారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవడంతో సోయా విత్తారు. కానీ ఆశించిన రీతిలో మొలకెత్తకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని జైనథ్, బేల, తలమడుగు మండలాల్లోని కొంత మంది రైతులు విత్తుకున్న సోయా మొలకెత్తలేదు. ప్రాథమిక సమాచారం మేరకు జైనథ్‌లో 200, తలమడుగులో 300, బేలలో 50 మందికి పైగా రైతుల పంట పొలాల్లో వేసుకున్న విత్తనం మొలకెత్తలేదని గుర్తించారు. వీరిలో కొంత మంది రైతులు తమకు విత్తనాలు విక్రయించిన వ్యాపారుల దుకాణాల ఎదుట ధర్నా చేయడంతో అధికారులు పంట పొలాలను పరిశీలించి నాణ్యత, నష్టం వివరాలను పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను వివరణ కోరగా, ఫిర్యాదులు వచ్చిన పంట పొలాలను శుక్రవారం శాస్త్రవేత్తలతో పాటు ఆయా మండల వ్యవసాయ అధికారుల బృందం పరిశీలిస్తుందని తెలిపారు.అడ్డగోలుగా..మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన మూడు రకాల సోయా విత్తనాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల మేరకు విత్తన సంచిపై విత్తనం రకం, లాట్ నంబర్, నాణ్యత, పరీక్షించిన తేదీ, మొలక శాతం, ప్యాక్ చేసిన తేదీ వివరాలు ఉండాలి. తలమడుగు మండలానికి చెందిన ఓ రైతు తాను తీసుకొచ్చిన సంచిపై వివరాలను పరిశీలిస్తే విస్తుపోయేలా ఉన్నాయి. విత్తనం పరీక్షించిన తేదీ : 16 డిసెంబరు 2022గా ఉంది. విత్తనం సంచిలో ప్యాకింగ్ చేసిన నెల ఏప్రిల్ 2022 ఉండగా, గడువు తేదీ నవంబరు 15, 2022గా ఉంది. విత్తనం పరీక్షించిన తర్వాతనే సంచిలో ప్యాక్ చేసి విడుదల చేయాలి. సంచిపై ముద్రించే వివరాలే ఇలా ఉంటే లోపల ఉండే విత్తనాలను ఎలా నమ్మేదని తలమడుగుకు చెందిన రైతులు ప్రేమేందర్, రాంరెడ్డి, ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ ధరలు ఇష్టమొచ్చినట్లు ఉన్నాయని వారు తెలిపారు. ఒక కంపెనీ 27 కిలోల సంచి ధర రూ.5,130గా ముద్రిస్తే, మరో కంపెనీ రూ.4,200 ధర ముద్రించి విక్రయిస్తోంది. ఎమ్మార్పీతో సంబంధం లేకుండా వ్యాపారులు ఇష్టమొచ్చిన ధరతో విక్రయించారు. గతేడాదితో పోలిస్తే విత్తన ధర భారీగా పెరిగినా.. ధర బాగుంటే ఎంతో కొంత మిగులుతుందని కొనుగోలు చేసి విత్తుకుంటే.. తీరా అవి మొలకెత్తకపోవడంతో లబోదిబోమంటున్నారు.

# అడిగినంత ఇచ్చుకో.. చెప్పిన చోటే తెచ్చుకో..!

మంచిర్యాల : పాఠశాలల ప్రారంభంతో మధ్యతరగతి కుటుంబాలు బెంబేలెత్తిపోతున్నాయి. నియంత్రణ లేకుండా పెరిగిన పాఠశాలల ఫీజులతోపాటు పుస్తకాలు, దుస్తుల ధరలు వేతన జీవులకు దడ పుట్టిస్తున్నాయి. కరోనాను దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు యాజమాన్యాలు ముందుగానే ఫీజుల వేట కొనసాగిస్తున్నాయి.

సేవ పేరిట అక్రమ తోవ

విద్యారంగం వ్యాపారం కాదు. 5 శాతం ఆదాయంతో పాఠశాలలు నడపాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. కానీ ప్రైవేటు పాఠశాలలు తమకు ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాయి. తమ వద్దనే పుస్తకాలు, నోటుపుస్తకాలు, దుస్తులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నాయి. ఎవరికి వారుగా పాఠశాలల్లో ఫీజులు అమాంతం పెంచుకున్నారు. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో వారు అడిగినంత ఇచ్చుకోవాల్సిందే. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీకి ఫీజు రూ. 22000, పుస్తకాలు 2600, యూనిఫాం, షూలకు రూ.



2000 వసూలు చేస్తున్నారు. ప్రాథమిక విద్యకే ఏడాదికి రూ.30వేలు వసూలు చేస్తుండగా.. ఉన్నత విద్య తరగతులకు రూ. 40వేల నుంచి రూ. 50వేల వరకు దండుకుంటున్నారు.

ప్రభుత్వ చర్యలు శూన్యం..

ప్రైవేటు పాఠశాలల్లో పెంచుతున్న ఫీజులను నియంత్రించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఏడాదికి పదిశాతం మించి ఫీజులు పెంచవద్దని హడావుడి చేశారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఫలితంగా ఒక్కో పాఠశాలలో తమ వీలును బట్టి 20 నుంచి 30శాతం పెంచారు.

విద్యను వ్యాపార కోణంలో చూడొద్దు

ప్రైవేటు పాఠశాలల్లో తప్పకుండా తల్లిదండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి. ఫీజులపై ఈ కమిటీ ఆధ్వర్యంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. విద్యను వ్యాపార కోణంలో చూడవద్దు. అధిక ఫీజులు వసూలు చేస్తే తప్పనిసరిగా సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి, మంచిర్యాల

జిల్లాకేంద్రంలో ఓ బుక్‌స్టాల్ ప్రధాన మార్కెట్‌కు దూరంగా ఉంటుంది. దాని చిరునామా కూడా చాలా మందికి తెలియదు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ బుక్‌స్టాల్‌లోనే పుస్తకాలు కొనాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. ఇలాంటి బుక్‌స్టాళ్లను పాఠశాలలు తమకు వీలుగా ఎంచుకొని సగం ధరను తమ ఖాతాలోకి వేసుకుంటూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారు.నస్పూర్‌కు చెందిన ధనంజయ్ తన పిల్లలను స్థానిక ప్రైవేటు పాఠశాలలో 3,4 తరగతులు చదివిపిస్తున్నారు. తమ పిల్లల పాఠ్య పుస్తకాలను ఆ పాఠశాల యాజమాన్యం మంచిర్యాల లోని తాము సూచించిన బుక్‌స్టాల్‌లోనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో రూ. 8600తో పుస్తకాలను కొనుగోలు చేశారు.

# అడ్డులేకుండా.. అడ్డగోలు దందా..



ఆసిఫాబాద్ : బొగ్గు గనులు, జలాశయాల నిర్మాణాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితుల కోసం ప్రభుత్వం పునరావాస కాలనీలను ఏర్పాటు చేస్తుంది. ముంపునకు గురికాక ముందే ఆయా గ్రామాల్లో ఉన్న సౌకర్యాలతో పాటు, ఆసుపత్రి, పాఠశాల, కమ్యూనిటీ భవనాలను నిర్మించాలి. నిర్వాసితుల సంఖ్యకు అదనంగా అధికారులు భూములు కేటాయించి, స్థలాలు పంపిణీ చేస్తారు. అయితే భవనాలు నిర్మించడం ఆలస్యమవడం, పునరావాస కాలనీలకు కొందరు వ్యక్తులు రాకపోవడంతో.. భూ బకాసురులు ఈ స్థలాలను కబ్జా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల యథేచ్ఛగా వీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.జిల్లాలోని మూడు ఉపరితల బొగ్గు గనులకు సంబంధించి 19 పునరావాస గ్రామాలు, కుమురం భీం జలాశయం పరిధిలోని 11 గ్రామాల్లో పునరావాసం ఏర్పాటు చేశారు. ఉపరితల గనులకు సంబంధించి మొత్తం 520 ఎకరాల్లో, కుమురం భీం జలాశయానికి ముంపునకు గురైన ప్రజలకు 274 ఎకరాల్లో ఆర్అర్ కాలనీలను ఏర్పాటు చేశారు. నిర్వాసితులు సైతం ఈ భూములు విక్రయించుకోరాదు. రిజిస్ట్రేషన్లు సైతం జరగవు. రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఆట స్థలాలు, తాగునీటి వసతి కోసం అధికారులు ఒక్కో గ్రామానికి ఎకరం, రెండు ఎకరాల వరకు స్థలం అధికంగానే కొనుగోలు చేశారు. అయితే వీటి నిర్మాణంలో జాప్యం ఏర్పడుతుండటంతో.. మిగులు భూములు ప్రస్తుతం కబ్జాలకు గురవుతున్నాయి.

జిల్లా ఆవిర్భావం అనంతరం ఈ కబ్జాలు మరింత ఎక్కువయ్యాయి. ఆసిఫాబాద్ పట్టణం నుంచి మంచిర్యాల వెళ్లే మార్గంలో కేస్లాపూర్ సింగరేణి పునరావాస గ్రామంగా ఉండగా, ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో కూడలి వద్ద కుమురం భీం జలాశయ పునరావాస గ్రామం భాగ్యనగర్ ఉంది. కలెక్టరేట్ వెనుక భాగంలో ఆర్అర్ కాలనీ ఉంది. జిల్లా ఏర్పడిన అనంతరం భూముల ధరలు విపరీతంగా పెరగడంతో.. భూ మాఫియా ఈ ఖాళీ జాగాలను యథేచ్ఛగా ఇతరులకు విక్రయిస్తున్నారు. ఒక్కో ప్లాటుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తూ, బాండ్ పేపర్ల మీద రాసుకుంటున్నారు.

పట్టింపేది?

నిర్వాసితుల గోడు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భూములు ఇచ్చి చేతులు దులుపుకొంటూ మౌలిక వసతుల కల్పన పట్ల పట్టనట్లుగా ఉంటున్నారు. ఆ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నా నిలువరించే ప్రయత్నం చేయడం లేదు. ఈ తరుణంలో అసలైన నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

లి కేస్లగూడ సింగరేణి పునరావాస కాలనీ కబ్జాలపై బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్‌ను సంప్రదించగా.. స్పందించ లేదు.

లి కేస్లాపూర్‌లో 22 కుటుంబాలకు పునరావాసం కల్పించగా.. ప్రస్తుతం 18 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయి. ఇక్కడ ప్రస్తుతం భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. ఓ మహిళా నేత భర్త దగ్గరుండి ఈ తంతంగమంతా నడిపిస్తున్నారని సమాచారం. ఆర్అర్ కాలనీలో 32 కుటుంబాలకు పునరావాసం కల్పించగా.. 15 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయి. అక్రమ నిర్మాణాలను సైతం కొందరు ప్రభుత్వ అధికారులే చేపట్టడం విస్మయపర్చే అంశం. భాగ్యనగర్‌లో సైతం ఖాళీగా ఉన్న ఎకరం భూమి తనదే అని ఓ వ్యక్తి కంచె వేసుకోగా, కాలనీవాసులందరూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కెరమెరి మండలంలోని నిశానిలో మూడు ఎకరాల పునరావాసం కోసం కేటాయించిన స్థలాన్ని ఓ నేత బంధువు కబ్జా చేసి మరీ సాగు పనుల కోసం దున్నుతుండటం గమనార్హం.

# సర్కారు దవాఖానాలో ఎక్స్‌రే కష్టాలు!

మంచిర్యాల : మంచిర్యాల పెద్దాసుపత్రి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)గా మారిన తర్వాత సేవలు మెరుగుపడతాయనుకున్న బాధితులకు.. తీవ్ర జాప్యం జరుగుతుండటంతో అవస్థలు పడుతున్నారు. చికిత్స పొందాలంటే రెండురోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యుడు చూసి పరీక్షలు రాయడం, సమయం పట్టడం, తీరా ఫలితం వచ్చేలోపు అతను వెళ్లిపోవడం.. ప్రతిరోజు వందల మందికి ఇదే తంతు జరుగుతోంది. సిబ్బంది కొరత, చెడిపోయిన యంత్రాలతో సమస్యగా మారింది. వైద్యకళాశాల మంజూరైంది కదా.. అన్ని సేవలు అందుతాయనే ఆశగా వస్తున్న రోగులు నిరీక్షిస్తూ నిరాశగా వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎక్స్‌రే విభాగంలో తీవ్ర ఇబ్బందులున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. మొరాయిస్తున్న పరికరాలతో అష్టకష్టాలు పడుతూ బాధితులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. నెలరోజులుగా అవస్థలు పడుతున్నా పరిష్కార మార్గం చూపించడం లేదు.

ఆర్థో సేవలకు ఆటంకం..

ఎక్స్‌రే విభాగంలో ఇబ్బందితో ఆర్థో సేవలకు ఆటంకం కలుగుతోంది. కీళ్లు, ఎముకలకు సంబంధించిన సమస్యలతో బాధితులు నిత్యం వందల సంఖ్యలో ఆసుపత్రికి వస్తున్నారు. ఇందులో దాదాపు తొంభై శాతం మందికి ఎక్స్‌రే అవసరం పడుతుంది. అయితే ఈ సేవల కోసం మరొక రోజు ఆగాల్సివస్తోంది. ఉన్న రెండు యంత్రాల్లో ఒకటి ఏరియా ఆసుపత్రి ప్రారంభించినప్పుడు అందుబాటులోకి వచ్చింది అయితే.. మరొకటి ఇటీవలే తీసుకొచ్చారు. కొత్త, పాత తేడా లేకుండా ఈ రెండు ఎక్స్‌రే యంత్రాలు మొరాయిస్తున్నాయి. ఒక్కో ఎక్స్‌రే తీయడానికి సమయం ఎక్కువగా తీసుకుంటుండటంతో పాటు సక్రమంగా రావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉన్న వారిపైనా ప్రభావమే..మంచిర్యాల పెద్దాసుపత్రికి రోజురోజుకి రోగులు పెరుగుతున్నా, సిబ్బంది మాత్రం పెరగడం లేదు. యంత్రాలు ఇబ్బందిపెట్టడంతో పాటు, సిబ్బంది కొరతకూడా ఎక్స్‌రే సేవలు జాప్యానికి ప్రధాన కారణం. ఉన్న సిబ్బందిపై భారమెక్కువవుతోంది. వందల మంది వస్తుండటంతో రెండు యంత్రాలకు కనీసం ఇద్దరు టెక్నీషియన్లయినా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే టెక్నీషియన్ రోజుకి వందల సంఖ్యలో ఎక్స్‌రే తీయడం వల్ల రేడియోషన్ ప్రభావం అధికంగా పడే ప్రమాదం ఉంది. మరమ్మతులు చేయించాలని తెలిపి పక్షం రోజులు గడుస్తున్నా.. సంబంధిత నిపుణులు రావడం లేదని ఇక్కడి సిబ్బంది వాపోతున్నారు. పర్యవేక్షకులు ప్రస్తుత బాధితుల తీవ్రత దృష్ట్యా సిబ్బందిని పెంచడంతో పాటు యంత్రాలను బాగు చేసేందుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఖర్చు తక్కువ.. మన్నిక ఎక్కువ!

హుస్నాబాద్ : కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన తారురోడ్డు కొన్ని రోజులకే దెబ్బతింటున్నాయి. వర్షపునీరు రోడ్లపై నీరు నిలువ ఉండటం, ఆ నీటిని లోపలికి పీల్చుకునే అవకాశం లేకపోవడమే ఇందుకు కారణం. ఈ సమస్యను అధిగమించేందుకు పీఎంజీఎస్‌వై రహదారుల నిర్మాణంలో సరికొత్త టెక్నాలజీ వచ్చింది. అదే కొబ్బరినారను ఉపయోగించే పద్ధతి. ఇప్పుడు ఈ విధానాన్ని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) నుంచి నాగారం వెళ్లే రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో జిల్లాలో కొత్తగా ప్రయోగాత్మకంగా చేస్తున్నారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) నుంచి నాగారం, అక్కడి నుంచి ఉమ్మాపూర్ వెళ్లే రహదారిని తారు రోడ్డుగా మార్చేందుకు ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద రూ.2.31 కోట్లు మంజూరయ్యాయి. 3.6 కి.మీ పొడవైన ఈ రహదారి నిర్మాణ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 7 చోట్ల కల్వర్టులు నిర్మిస్తున్నారు. 6 చోట్ల సిమెంట్ పైపులతో కల్వర్టులు, ఒక చోట స్లాబ్‌తో కూడిన కల్వర్టు నిర్మిస్తున్నారు. కుంట మత్తడి సమీపంలో స్లాబ్‌తో వంతెన నిర్మించాల్సి ఉంది. ఇన్నాళ్లు ఈ రహదారి మొత్తం మట్టిరోడ్డు. ద్విచక్ర వాహనాలు, ఎడ్ల బండ్లు మాత్రమే వెళ్లేవి. దీనిని వెడల్పు చేశారు. మట్టిపోయించి నీళ్లు పడుతూ తొక్కించారు.

# రొక్కం రాక.. వస్తోంది దుఃఖం

మంచిర్యాల : అష్టకష్టాలు పడి పండించిన ధాన్యాన్ని అమ్మిన రైతుకు డబ్బులు ఇప్పటి వరకు అందకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. 72 గంటల వ్యవధిలోనే రైతు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం చూపడం లేదు. అసలే కొనుగోళ్ల సమయంలో తూకం వేసిన దగ్గర నుంచి మిల్లర్ల వరకు తప్ప, తాలు, తేమ అంటూ కొర్రీలు పెట్టి తూకంలో కోతలు విధించారు. అన్ని గండాలను దాటినా..రెక్కల కష్టానికి ఫలితమైన ధాన్యం రొక్కం మాత్రం చేతికందడం లేదు. ధాన్యం డబ్బులు ఇంకా ఖాతాల్లో పడకపోవడంతో పెట్టుబడి తిప్పలు తప్పడం లేదు. ఈ యాసంగిలో వరి తక్కువగా సాగు చేయడం..ఉన్న పంటలు కూడా దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయారు. సాగు పనులు ప్రారంభమైనా ధాన్యం డబ్బులు చేతికందకపోవడంతో పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సేకరించిన ధాన్యం: 1.11 లక్షల మెట్రిక్ టన్నులు

మొత్తం రైతులు: 17,750



ధాన్యం విలువ: రూ. 216.65 కోట్లు

ట్యాబ్‌లో ఎంట్రీ చేసిన ధాన్యం విలువ: రూ. 197.13 కోట్లు

ఇప్పటి వరకు చెల్లించిన నగదు:

రూ.115.38 కోట్లు

చెల్లించాల్సిన సొమ్ము: రూ.81.75 కోట్లు

నగదు పొందిన రైతులు: 9,059

వెంటనే డబ్బులు ఇవ్వాలి

నేను యాసంగిలో ఆరు ఎకరాల్లో వరి సాగు చేయగా 160 క్వింటాళ్ల ధాన్యం చేతికి వచ్చింది. వీటిని తూకం వేసి 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు పైసలు పడలేదు. మళ్లీ వానాకాలం పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేదు. రోజు బ్యాంకు పోయి చూస్తున్నా..కానీ నగదు పడటం లేదు.వెంటనే డబ్బులు వేసేలా అధికారులు చూడాలి.

- చల్ల సరోజన, రెబ్బెన, కన్నేపల్లి మండలం

# నేడు విజయవాడ, నెల్లూరు జిల్లా కావలిలో ముఖ్యమంత్రి పర్యటన



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు (12-05-2023) విజయవాడ, నెల్లూరు జిల్లా కావలిలో పర్యటించనున్నారు. విజయవాడలో అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో సీఎం వైయస్ జగన్ పాల్గొంటారు. అనంతరం నెల్లూరు జిల్లా కావలిలో చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కు కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

**విజయవాడ షెడ్యూల్..** ఉదయం 8.25 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం చేరుకుంటారు. అక్కడ రేపటి నుంచి ప్రారంభమయ్యే శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో సీఎం వైయస్ జగన్ పాల్గొంటారు, అనంతరం 9.35 గంటలకు తాడేపల్లి హెలీప్యాడ్‌కు చేరుకుని కావలి బయలుదేరుతారు.

**కావలి షెడ్యూల్..** ఉదయం 9.35 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంకు చేరుకుంటారు. ఆ తర్వాత కావలి మినిస్టేడియంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కు కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమం అనంతరం కావలి నుంచి బయలుదేరి సాయంత్రానికి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటి భారీ జరిమానా




ఢిల్లీ : ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటీ భారీ జరిమానా విధించింది. చిత్తూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అవకతవకలపై సీరియస్ అయిన ఎన్జీటీ ఏపీ ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించింది. గుత్తా గుణశేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ పుష్ప సత్యనారాయణ, నిపుణుడు డాక్టర్ కె. సత్యగోపాల్‌లతో కూడిన ఎన్జీటి చెన్నై బెంచ్ తీర్పును వెలువరించింది. ఆవులపల్లి , ముదివీడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్ల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ అనుమతులను సైతం ఎన్జీటీ రద్దు చేసింది. మూడు రిజర్వాయర్లను ఒకే జీవో కింద చేపట్టి తాగునీటి కోసమని ఏపీ ప్రభుత్వం మొదట వాదించింది. పర్యావరణ అనుమతులు తీసుకున్న తరువాతే ఎన్జీటి ఆదేశించిన తరువాత మూడు ప్రాజెక్టులను విడగొట్టి ఆవులపల్లి రిజర్వాయర్‌కి మాత్రమే ఏపీ ప్రభుత్వం పర్యావరణ అనుమతి తీసుకుంది. పర్యావరణ అనుమతుల దస్త్రాలలోనూ ప్యాబ్రికేట్ చేశారని ఎన్జీటి పేర్కొంది.కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఎన్జీటి కమిటీ ఏర్పాటు చేసింది. పర్యావరణ ఉల్లంఘనలపై అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర స్థాయి పర్యావరణ మదింపు సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే అంశాన్ని పరిశీలించాలని ఎన్జీటి ఆదేశించింది. పిటిషనర్ గుత్తా గుణశేఖర్ తరపున ఎన్జీటిలో లాయర్ కె. శ్రవణ్ కుమార్ వాదించారు. పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన కంపెనీ ఫీజు చెల్లించింది. మూడు ప్రాజెక్టులకు కలిపి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులను తీసుకోకుండా మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఉన్న శాఖ అనుమతులు మాత్రమే ఏపీ ప్రభుత్వం తీసుకుంది. దీనిపై ఎన్జీటీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది.

# రాష్ట్రాభివృద్ధి, ప్రజల బాగు కోసమే శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

## డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

విజయవాడ: రాష్ట్ర ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం, రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన మరింత బలోపేతం కావడం కోసం చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం, దేవాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో సీఎం వైయస్ జగన్ పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి సారిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని చెప్పారు.

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి సంబంధించిన ఏర్పాట్లను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్య భక్తులకు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యజ్ఞానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఈనెల 12వ తేదీన మొదలై 17వ తేదీన మహాపూర్ణాహుతితో కార్యక్రమాలన్నీ పూర్తవుతాయని చెప్పారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



సాధించాలనేది శ్రీలక్ష్మీమహాయజ్ఞం ముఖ్యఉద్దేశమన్నారు. సనాతన ధర్మాన్ని నిలబెట్టి, భావితరాలకు హిందూధర్మ గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు ఈ యజ్ఞాన్ని తలపెట్టామని వివరించారు.

# ఇళ్లు లేని వారికి ఉచితంగా అమరావతిలో ఇళ్లపట్టాలు

## పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం వైయస్.జగన్



తాడేపల్లి: గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన పేదల సొంతింటి కల సాకారం కానుంది. ఇళ్లు లేని వారికి సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఉచితంగా అమరావతిలో ఇళ్లపట్టాలు ఇవ్వనున్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కింద ఉచితంగా ఇళ్లపట్టాలు ఇవ్వనున్నారు. ఇది ఇళ్లు లేని నిరుపేదల చిరకాల వాంఛ నెరవేర్చే బృహత్త కార్యక్రమని సీఎం వైయస్ జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను వెంటనే పూర్తి చేయాలని సీఎం వైయస్ జగన్ ఆదేశించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు 50 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం తీసుకుంటున్న చర్యలను సీఎంకు వివరించిన అధికారులు. 1402.58 ఎకరాల్లో 50,004 మందికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం. మొత్తం 21 లే అవుట్లలో పేదలకు ఇళ్లపట్టాలు. గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారులకు 10 లే అవుట్లలో, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లబ్ధిదారులకు 11 లే అవుట్లలో ఇళ్ల పట్టాలు. ఈ స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి. జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవలింగ్ పనులు ముగిశాయని వెల్లడించిన అధికారులు. దాదాపు 180 కిలోమీటర్ల మేర అంతర్గత గ్రావెల్ రోడ్లు వేసే పనులుకూడా చేపడుతున్నామని వెల్లడి. ప్రస్తుతం ఉన్న హైకోర్టుకు అదనపు భవనం నిర్మాణం కూడా పూర్తవుతోందని వెల్లడించిన అధికారులు. 76,300 చదరపు అడుగులు విస్తీర్ణంతో ఈ భవనం అందుబాటులోకి వస్తోందని, 14 కోర్టు హాళ్లకు అవసరమైన సదుపాయాల కల్పన కూడా జరుగుతోందని వెల్లడించిన అధికారులు. సీఐటీఐఐఎస్ కార్యక్రమం కింద చేపడుతున్న పనులనూ వివరించిన అధికారులు. దాదాపు 12 అర్బన్ ప్రాంతాల్లో ఈ పనులు చేపడుతున్నామని వెల్లడి.




రాజమహేంద్రవరం: ప్రేమించిన ప్రియుడిని ప్రియురాలే హతమార్చిన ఘటన తూర్పుగోదావరి జిల్లాలో కలకలం రేపింది. నాలుగేళ్ల పాటు ప్రేమించి ముఖం చాటేసిన ప్రియుడ్ని అర్ధరాత్రి ఇంటికి వెళ్లి మరీ హత్య చేసింది.

పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలపాలెం గ్రామానికి చెందిన ఒమ్మి నాగశేషు (26) గ్రామంలో చిన్నపాటి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. రంపచోడవరం మండలం చిలకవీధికి చెందిన కుర్ల డెబొర రాజమహేంద్రవరంలో చదువుతున్న సమయంలో నాగశేషుతో పరిచయం ఏర్పడింది.ఈ పరిచయం ప్రేమగా మారడంతో ఇరువురు నాలుగేళ్ల పాటు ప్రేమించుకున్నారు. అయితే, నాగశేషు కుటుంబ సభ్యులు ఏడాది క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన యువతితో అతడికి వివాహం జరిపించారు. అప్పటి నుంచి ఈ విషయాన్ని ప్రియురాలి వద్ద దాచి ఉంచాడు. ఇటీవల ప్రియురాలికి విషయం తెలియడంతో పలుమార్లు నాగశేషుతో గొడవపడింది. ఈ నేపథ్యంలో ఆ యువతి తన స్నేహితుడు రాజవొమ్మంగి మండలం దూసరపాముకు చెందిన శివన్నారాయణతో కలిసి అర్ధరాత్రి నాగశేషు ఇంటికి వెళ్లింది. డాబాపై నిద్రిస్తున్న నాగశేషు వద్దకు వెళ్లి నిద్రలేపి గొడవకు దిగింది. వెంటనే తన వెంట తెచ్చుకున్న కత్తిపేటతో అతడిపై దాడి చేసింది. ఆమెతో పాటు వచ్చిన యువకుడు కర్రతో కొట్టాడు. కేకలు వినిపించడంతో స్థానికులు ఘటనా స్థలికి చేరుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న నాగశేషును అంబులెన్స్‌లో రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే అతడు ప్రాణాలు విడిచాడు. డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై శివనాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుల ఆక్రందనే పెను ఉప్పెనవుతుంది: చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో నేటి అన్నదాతల ఆక్రందన రేపు పెను ఉప్పెన అవుతుందని.. అందులో వైకాపా కొట్టుకుపోతుందని తెదేపా అధినేత చంద్రబాబు హెచ్చరించారు. అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని ఆయన నిలదీశారు. ఈ మేరకు #FarmersSufferingInAP పేరుతో చంద్రబాబు ట్వీట్ చేశారు. "దెబ్బతిన్న పంటల వివరాలు ఇప్పటికీ ఎందుకు వెల్లడించడం లేదు? రబీకి పంటల బీమా ప్రీమియం విషయంలో వాస్తవాలు దాచి పెట్టడానికి కారణాలేంటి? అకాల వర్షాలకు అన్నదాతకు జరిగిన నష్టానికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఎక్కడ? దెబ్బతిన్న పంట ఎంత.. కొన్న ధాన్యం ఎంత? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతును ఆదుకునేందుకు రాకెట్ సైన్స్ చదవాలా అన్న జగన్.. ఇప్పుడు ఎక్కడున్నారు? 15 జిల్లాల్లో పంట నష్టం జరిగితే ఒక్క రైతు దగ్గరకు కూడా ఈ సీఎం ఎందుకు వెళ్లలేదు?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. రైతులకు వెంటనే పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



# వైయస్ఆర్ స్టేడియంలో మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం

## మహిళా క్రికెటర్లు సబనామ్, అంజలికి రూ.10 లక్షల చొప్పున నగదు బహుమతి అందజేత

## ఏపీఎల్ సీజన్-2ను ప్రారంభించిన సీఎం వైయస్ జగన్






విశాఖపట్నం: పీఎం పాలెంలోని వైయస్ఆర్ స్టేడియం ప్రాంగణంలో దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వైయస్ఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులను పరిచయం చేసుకొని వారితో గ్రూప్ ఫొటో దిగారు. అదే విధంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఎల్ సీజన్-2ను ప్రారంభించారు. అండర్ - 19 మహిళా వరల్డ్ కప్‌లో పాల్గొన్న మహిళా క్రికెటర్లు సబనామ్, అంజలిని సీఎం వైయస్ జగన్ అభినందించి ఘనంగా సత్కరించారు. వారికి రూ.10 లక్షల చొప్పున నగదు బహుమతిని అందజేశారు.

అనంతరం ఏపీఎల్ సీజన్-2 రంజీ ప్లేయర్లతో మాట్లాడి వారితో గ్రూప్ ఫొటో దిగారు. సీఎం వైయస్ జగన్ వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైయస్ఆర్ సీపీ నేతలు, అధికారులు ఉన్నారు.

# జాబ్ క్యాలెండర్ లేక యువత పెడదారి పట్టే ప్రమాదం ఉందన్న యువనేత



కర్నూలు: యువగళం పాదయాత్ర చేస్తున్న టీడీపీ నేత నారా లోకేష్‌ను ఆయా ప్రాంతాల్లో ప్రజలు కలుస్తున్నారు. ఈరోజు నందికొట్కూరు నియోజకవర్గంలో 96వ పాదయాత్రను ప్రారంభించిన లోకేష్‌ను తర్తూరు గ్రామస్తులు కలిసి తమ సమస్యలు విన్నవించారు. అన్ని సమస్యలు తీరుస్తామని యువనేత హామీ ఇచ్చారు. అనంతరం మండ్లెం గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తాము పడుతున్న బాధలను తెలిపారు. మండ్లెం, తంగడంచ గ్రామ పొలిమేరల్లో 300 బావులు ఉన్నాయని... ఈ బావులను గతంలో ఎన్టీఆర్ తవ్వించారన్నారు. అప్పటి నుండి తాము ఒక పంట వేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. నాగటూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మండ్లెం గ్రామ చెరువులకు నీరు నింపాలని కోరారు. రైతులకు 12 గంటలకు విద్యుత్ ఇవ్వాలని... కొత్త కనెక్షన్లు సత్వరమే ఇవ్వాలన్నారు. తమ గ్రామంలో డి.ఫారం పట్టా పొలాలకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని వినతి చేశారు. మండ్లెం, తంగడంచ గ్రామాల్లోని పోరంబోకు పొలాలను రైతులకు పూర్తి హక్కు ఉండేలా పట్టా పుస్తకాలు అందించాలన్నారు. మండ్లెం గ్రామం నుంచి లక్ష్మాపురం తారు రోడ్డు వేయాలని.. మండ్లెం నుండి కొణిదెలకు మెటల్ రోడ్డు వేయాలని కోరారు. చంద్రన్న పెళ్లి కానుకలు ఎస్సీలకు లక్షన్నర, బీసీ, మైనారిటీలకు లక్ష చొప్పున అందించాలన్నారు. మహిళలకు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు 75శాతం రాయితీ ఇవ్వాలన్నారు. డిగ్రీ చదివిన వారికి భృతి అందించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని గ్రామస్తులు కోరారు. నారా లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టని జగన్... రైతుల మోటార్లకు మీటర్లు పెట్టి ఉరితాడు బిగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి సాగు, తాగునీరు అందజేస్తామని భరోసా ఇచ్చారు. యేటా జాబ్ కేలండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్ మోసం చేయడంతో యువత పెడదారి పట్టే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికే పలువురు గంజాయి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలు మెరుగుపర్చి నిరుద్యోగాన్ని అరికడతామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో మాదిరి పెళ్లికానుకలను పునరుద్ధరిస్తామని చెప్పారు. డి.ఫారం పట్టాలకు రిజిస్ట్రేషన్ అంశాన్ని.. కర్నాటక రాష్ట్ర విధానాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మహిళలకు ప్రోత్సాహకాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎస్సీల సామాజిక న్యాయానికి టీడీపీ కట్టుబడి ఉంటుందని లోకేష్ స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టులో షిండే వర్గానికి షాక్..

మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. షిండే వర్గానికి షాక్ ఇచ్చింది. షిండే వర్గానికి సంబంధించిన వ్యక్తి భరత్ గోగవాలేను విప్‌గా నియమిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. అంతేకాదు కేవలం ఒక లేఖ ఆధారం చేసుకుని ఉద్ధవ్ థాక్రేకు మద్దతు లేదని చెప్పడం సరికాదని అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే గవర్నర్ తీసుకున్న నిర్ణయం కూడా సహేతుకంగా లేదని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఫడ్నవీస్‌తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉద్ధవ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఉండాల్సిందని చెప్పిన సుప్రీంకోర్టు... వారు ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించింది. ఇదిలా ఉంటే బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వ ఏర్పాటు విషయంలో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉద్ధవ్ థాక్రే విశ్వాస పరీక్షను ఎదుర్కోకుండానే రాజీనామా చేయడాన్ని ఇందుకు కారణంగా పేర్కొంది.అదే సమయంలో ఒక లేఖ ద్వారా గవర్నర్ ఫ్లోర్ టెస్టుకు అనుమతించడం తప్పని చెబుతూనే పై ఆదేశాలు జారీ చేసింది. ఒక వేళ థాక్రే రాజీనామా చేయకుండా ఉండి ఉంటే తిరిగి ప్రభుత్వ ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చి ఉండేవారమని ధర్మాసనం పేర్కొంది. ఫిబ్రవరి 21వ తేదీనుంచి రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారణ చేస్తోంది.

ఉద్ధవ్ తరపున సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబాల్, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వి, దేవదత్ కామత్‌లు వాదించారు. ఇక షిండే తరపున సీనియర్ అడ్వకేట్లు నీరజ్ కిషన్ కౌల్, హరీష్ సాల్వే, మహేష్ జెఠ్మలానీ, మనిందర్ సింగ్‌లు వాదించారు. మహారాష్ట్ర గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేసులో ఉన్న పలు పిటిషన్లను ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేసింది. ఇందులో చీఫ్ జస్టిస్ చంద్ర చూడ్, జస్టిస్ ఎంఆర్ షీ, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ పీఎస్ నరసింహాలు ఉన్నారు. అయితే అనర్హత ఎదుర్కొంటున్న ఒక స్పీకర్ రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారం ఉందా లేదా అనేది స్పష్టం చేయాలని కోరుతూ విస్తృత స్థాయి ధర్మాసనానికి బదిలీ చేసింది.

# ఉదయ్ కుమార్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దు.. అవినాష్ ప్రమేయమూ ఉంది: సీబీఐ

హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన డైరీని సీబీఐ అధికారులు న్యాయస్థానానికి సమర్పించారు. ఈ సందర్భంగా కేసులో ఏ6గా ఉన్న గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఇరువర్గాలు వాదనలు వినిపించాయి. హత్య కేసులో ఉదయ్ కుమార్‌రెడ్డికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ తెలిపింది. హత్య కేసులో ఉదయ్ కుమార్‌రెడ్డి ప్రమేయంపై ఆధారాలు సేకరించాకే అరెస్టు చేశామని కోర్టుకు వివరించింది. ఈ మేరకు సీబీఐ కౌంటర్ దాఖలు చేస్తూ బెయిల్ ఇవ్వొద్దని కోరింది. వాదనలు విన్న న్యాయస్థానం.. బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులను ఈనెల 15కు వాయిదా వేసింది. మరోవైపు వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాల ధ్వంసంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రమేయం ఉందని కౌంటర్‌లో సీబీఐ పునరుద్ఘాటించింది.



## హైదరాబాద్ లో సామ్ కొత్త ఫ్లాట్..!

సమంత హైదరాబాద్ లో ఉన్న ఆస్తులన్నీ అమ్మేసి ముంబైకి వెళ్లిపోతుందని.. భాగ్యనగరంతో ఉన్న మధుర జ్ఞాపకాల్ని ఇక్కడే వదిలేసి వెళ్లిపోతుందని... ముంబైలో ఫ్రెష్ గా కొత్త జీవితన్ని ప్రారంభిస్తుందని కొన్ని నెలలుగా టాలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. నాగచైతన్యతో విడాకుల అయిన నాటి నుంచి ఈ రకమైన కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. ఓ వైపు సమంత తెలుగు సినిమాలు చేస్తున్నా? వాటితో పనిలేకుండా బాలీవుడ్ లో భవిష్యత్ ని ప్లాన్ చేసుకుందని..శేష జీవితం కూడా అక్కడే ముగించేస్తుందని ప్రచారం పతాక స్థాయిలోనే జరిగింది. ఈ క్రమంలోనే సమంత ముంబైలో కొత్తగా ప్లాట్లు లు కొనుగోలు చేయడం వంటి సన్నివేశాలు ఈ కథనాలకు మరింత బలం చేకూర్చాయి. హైదరాబాద్ లో ఉన్న ప్రాపర్టీస్ సహా శాశ్వత నివాసాన్ని సైతం అన్నింటిని అమ్మేసి ముంబైలో కొనుగోలు చేస్తుందని అంతకంతకు మీడియా కథనాలు వెడెక్కించాయి. తాజాగా సమంత ఓ బ్రేకింగ్



న్యూస్ తో అన్ని రకాల కథనాలకు చెక్ పెట్టినట్లు అయింది. హైదరాబాద్లోని జయభేరి ఆరెంజ్ కౌంటీలో 7.8 కోట్ల ఖరీదు గల డ్యూప్లెక్స్ ఫ్లాట్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ విలాసవంతమైన నివాసం 13వ అంతస్తులో ఉందిట. ఆ డూప్లెక్స్ కొలతలు ఇలా ఉన్నాయి. 7944 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తుంది. సమంత అభిరుచుకి అనుగుణంగా ఆ ఫ్లాట్ ని రీమోడల్ చేయించుకుంటుందని తెలిసింది. దీంతో సమంతపై వస్తోన్న కొన్ని రకాల కథనాలకు తాత్కలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఆస్తులు అమ్మేసుకుని ముంబై పోతుందని భావించిన వారంతా ఇలాంటి టర్నింగ్ తీసుకుందేంటని ఆలోచనలో పడ్డారు. ప్రస్తుతం సమంత గచ్చిబౌలిలో ఓ ఫ్లాట్ కలిగి ఉంది. చైతన్యతో -సమంత జంటగా కొనుగోలు చేసిన ఫ్లాట్ అది. విడాకులకు ముందే చైతన్య ఫ్లాట్ వెకెట్ చేసి వచ్చేసాడు. ఆ తర్వాత సమంత ఆ హక్కులు తీసుకుంది. తన టేస్ట్ కి తగ్గట్టు ఆ ఫ్లాట్ ని మార్చుకుంది. అతి త్వరలో సమంత తన కొత్త ఇంటి వివరాల్ని..డిజైన్ ని ఇన్స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక ఆదాయం పరంగా సమంత బాగానే సంపాదిస్తుంది. ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు ఎండార్స్ మెంట్ జోరుగా చేస్తుంది. వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు.

## అవమానం జరిగిన చోటే గౌరవం దక్కించుకున్న శోభిత

గూఢచారి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ శోభిత దూళిపాళ్ల. ఈ అమ్మడు బాలీవుడ్ లో అంతకు ముందు సినిమాలు చేయడంతో చాలా శాతం మంది ఈమె నార్త్ ఇండియన్ అనుకున్నారు. కానీ శోభిత తెలుగు అమ్మాయి. మోడలింగ్ పై ఆసక్తితో చిన్న వయసులోనే ప్రయత్నాలు మొదలు పెట్టిందట. ప్రస్తుతం సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా పలు సినిమాల్లో నటిస్తున్న ముద్దుగుమ్మ శోభిత ధూళిపాళ్ల వరుసగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నాకు 20 ఏళ్ల వయసు ఉన్న సమయంలోనే మోడలింగ్ చేయాలనుకున్నారు. అప్పుడు ఒక



షాంపూ కంపెనీ యొక్క వాణిజ్య ప్రకటన లో నటించేందుకు వెళ్లాను. ఆ సమయంలో కంపెనీ వారు నన్ను కనీసం బ్యాక్ గ్రౌండ్ లో కనిపించే మోడల్ గా కూడా పనికి రావు అంటూ అవమానించారు. ఆ సమయంలో శోభిత మౌనంగా అక్కడ నుండి వచ్చేసిందట. కానీ కొన్నాళ్ల తర్వాత అదే సంస్థ యొక్క బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. శోభిత ఈ మధ్య కాలంలో మోడల్ గా మరియు హీరోయిన్ గా బిజీ బిజీగా ఉంది. ఈ సమయంలోనే అక్కినేని హీరో నాగ చైతన్య తో ప్రేమలో ఉందనే పుకార్లతో వార్తల్లో నిలిచింది. ఆ విషయం వాస్తవం కాదని పలు సార్లు శోభిత పేర్కొంది. అయినా కూడా పుకార్లు ఆగడం లేదు.




## ఎన్టీఆర్ 30 హీరోయిన్ 'ఉలాజ్'..!



ప్రస్తుతం ఎన్టీఆర్ నటిస్తున్న ఎన్టీఆర్30 సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమాతో జాన్వీ కపూర్ టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అయ్యింది. తెలుగు లో ఎంట్రీ ఇవ్వడానికి ముందే హిందీలో వరుసగా సినిమాలు మరియు సిరీస్ ల్లో ఈమె నటించిన విషయం తెల్సిందే. ఇప్పటి వరకు బాలీవుడ్ లో పెద్దగా సక్సెస్ లు దక్కించుకోలేక పోయిన జాన్వీ కపూర్ తన అందాల ఆరబోత కారణంగా మరియు స్టార్ కిడ్ అవ్వడం వల్లో కానీ వరుసగా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈమె జంగ్లీ పిక్చర్స్ బ్యానర్ లో ఒక సినిమాను చేస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహిస్తున్న జాన్వీ కపూర్ తాజా హిందీ సినిమా యొక్క టైటిల్ ను 'ఉలాజ్' అంటూ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా లో జాన్వీ కపూర్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ గా కనిపించబోతుంది. ఆమె పాత్రకు సంబంధించిన లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా లో జాన్వీ కపూర్ పాత్ర మరియు నటన గురించి సినిమా విడుదల అయిన తర్వాత అంతా మాట్లాడుకుంటారు అంటూ యూనిట్ సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య... రోషన్ మాథ్యూ... రాజేష్ తైలాంగ్.. మీయాంగ్ చాంగ్.. సచిన్ ఖేడేకర్.. రాజేంద్ర గుప్త ఇంకా ఎంతో మంది ప్రముఖ నటీనటులు ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు.

## ఒక్క సాలిడ్ హిట్ కూడా లేని అషురెడ్డి ఇన్ని దేశాలు ఎలా తిరిగేస్తోందబ్బా?





బుల్లితెర మీద అషురెడ్డి చేసే సందడి అంతా ఇంతా కాదు. బిగ్ బాస్ ద్వారా బుల్లితెర ఎంట్రీ ఇచ్చిన ఆమె ఆ తర్వాత అనేక రకాల మాటీవీ షోలలో కనిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాస్త షోలలో కనిపించడం తగ్గించిన సోషల్ మీడియాలో మాత్రం రచ్చ చేస్తూ వస్తోంది. అషు రెడ్డి తల్లిదండ్రులు అమెరికాలో నివసిస్తారని సంగతి తెలిసిందే. అమెరికాలో కొన్నాళ్లు ఇండియాలో కొన్నాళ్ళు అన్నట్టుగా అషు రెడ్డి షెడ్యూల్ సర్వీస్ చేస్తోంది. అయితే నిజంగా అషురెడ్డి అంత రిచ్చా ఒకరోజు అమెరికాలో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది మరుసటి రోజు దుబాయ్ లో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది ఆ తర్వాత థాయిలాండ్ లో ఉన్నానని లేదా మాల్దీవులలో ఉన్నానని ఇలా రకరకాల పోస్టులు రకరకాల ప్రదేశాల నుంచి పెడుతూ ఉంటుంది. అయితే ఒక టీవీ నటి అది కూడా సినిమాలు చేసిన చిన్నా చేతగా సినిమాలు తప్ప పెద్ద సినిమా ఆఫర్ ఒక్కటి కూడా రాని నటి ఇంతలా ఎలా ఖర్చు పెడుతుంది. ఆమె ఆదాయం మార్గం ఏమిటి అని పెద్ద ఎత్తున ఇప్పుడు చర్చ జరుగుతోంది. వాస్తవానికి అషురెడ్డి చిన్నప్పుడే ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు అమెరికాలోని కొన్నాళ్లపాటు సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసిన అషు సినీ రంగం మీద ఉన్న మక్కువతో అప్పట్లో డబ్ స్మాష్ చేస్తూ జూనియర్ సమంత గా పేరు తెచ్చుకుంది. అలా ఒక సినిమా అవకాశం దక్కించుకుంది. సినిమా రంగంలో పరిచయాలు పెరిగిన తర్వాత కూడా కొన్నాళ్లు ఇక్కడ కొన్నాళ్ళు అమెరికాలో గడుపుతూ వస్తోంది. అయితే ఆమె ఇంతలా ఖర్చు పెట్టడానికి ఇన్ స్టాగ్రామ్ ద్వారా ఆదాయం వస్తుందని అంటున్నారు. ఎప్పటికప్పుడు ఇన్ స్టాగ్రామ్ ద్వారా హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఉండే ఈ భామ ఫాలోవర్లను పెంచుకుంటూ కొన్ని ప్రోడక్టను మార్కెటింగ్ చేస్తోందని ఆయా సంస్థలు రెమ్యూనరేషన్ కింద ఇచ్చే డబ్బుతోనే ఇంత హ్యాపీగా కావలసిన చోటికి తిరుగుతుందని తెలుస్తోంది.

## ఆ వీడియో లీకైతే ప్రియాంక చోప్రా పరిస్థితి ఏంటి?

స్టార్ హీరోయిన్ ఎవరైనా? వాక్ చేస్తూ నేలపై పడిపోతే? మీడియాకి అంతకు మించిన స్టఫ్ ఆరోజుకి దొరకనట్లే. స్పాట్ లో ఉన్న ఫోటో గ్రాఫర్లు టపీ టపీ మని ఓ వంద ఫోటోలు కొట్టేస్తారు. హెచ్ డీ వీడియోలు సిద్ధమైపోతాయి. ఎందుకంటే అలాంటి వార్తలకు.. అలాంటి ఫోటోలు.. వీడియోలకు డిమాండ్ ఎక్కువ. అందులోనూ అలాంటి వాటిపై టాలీవుడ్ మీడియా ఏ రేంజ్ లో ఏసుకుంటుందో చెప్పాల్సిన పనిలేదు. స్లోమోషన్ లో.. స్పీడ్ మోషన్ లో రకరకాల పద్దతుల్లో ఆ వీడియోని... ఫోటోల్ని జనాల ముందుకు తీసుకెళుతుంది. అందులోనూ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా అలాంటి సన్నివేశం ఎదురైతే రచ్చ ఏ రేంజ్ లో ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. సోషల్ మీడియాలో మీమ్స్.. ట్రోలింగ్స్ గురించైతే ఊహించలేం. ఇలాంటి



సంఘటన నుంచి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తృటిలోనే తప్పించుకుంది. అవును 'లవ్ ఎగైన్' ప్రమోషన్ లో భాగంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్ పై పీసీ వాక్ చేస్తూ కింద పడిపోయింది. హైహీల్స్ ధరించడంతోనే ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. దీంతో పీసీ ఒక్కసారిగా గందరగోళానికి గురైంది. ఆ సమయంలో మనసులో రకరకాల భయాలు వెంటాడాయి. అమెరికాలో జరిగే ప్రచారం గురించి దేవుడెరుగు? ఇండియన్ మీడియాలో ఈ వీడియో ..ఫోటోలు వైరల్ అయితే పరిస్థితి ఏంటని ! ఒక్క క్షణం ఊపిరాడనంత పనైంది. కానీ పీసీ అనుకున్న దానికి రివర్స్ లో జరిగింది. పీసీ కింద పడిపోతున్న సమయంలో ఒక్కసారిగా కెమెరాలన్ని డౌన్ అయ్యాయి. పడిపోతున్న సమయంలో తనని పైకి లేవడానికి చుట్టూ ఉన్న వారంతా సహకరించారు. దాదాపు ఐదారుగురు ఆమెని పైకి లేపే ప్రయత్నం చేసారు. ఆ సమయంలో భర్త నిక్ జోనాస్ కూడా ఉన్నారు. ఈ సందర్భాన్ని ఓ చర్చా వేదికలో గుర్తు చేసుకుని అమెరికన్ మీడియాకి పీసీ సలాం చేసింది. 'నా 23 ఏళ్ల కెరీర్ లో ఎప్పుడూ ఇలాంటి సంఘటన చోటు చేసుకోలేదు. ఆ వీడియో నెట్టింట వైరల్ అవుతుందని చాలా భయపడ్డా. కానీ ఒక్క వీడియో గానీ..ఫోటో గానీ గూగుల్ లో దొరొకలేదు. మానవత్వంతో వాళ్లంతా వ్యవహరించారు. ఓ వ్యక్తి మాత్రం తన దగ్గర వీడియో ఉందని అన్నారు. కానీ అది తన ముందే డిలీట్ చేసినట్లు' తెలిపింది.

## సోఫాలో రసగుల్ల ఇలా కోలుకుందో లేదో కానీ..!

యాక్సిడెంట్ లో చేయి విరగ్గొట్టుకుని నభానటేష్ తీవ్రంగా ఇబ్బందికి గురైన సంగతి తెలిసిందే. ప్రమాదంలో శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. అయితే ఎముకలు విరిగాక నొప్పి భరించలేనంతగా ఉందని నభా బాధను వ్యక్తం చేసింది. దీనికి శస్త్ర చికిత్స జరిగింది. కొంతకాలం పాటు పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వస్తున్నందుకు చాలా ఆవేదనగా ఉన్నానని నభా తెలిపింది. అయితే ఎట్టకేలకు అన్ని గాయాల నుంచి కోలుకుని తిరిగి యాక్టివ్ అయినట్టే కనిపిస్తోంది. నెమ్మదిగా కోలుకుని తిరిగి తనదైన ఎనర్జీని పుంజుకుంటోంది ఈ ఇస్మార్ట్ భామ. ఇంతలోనే తనదైన శైలిలో



అద్భుతమైన ఫోటోషూట్ తో నభా నటేష్ వెబ్ లోకి దూసుకొచ్చింది. చినుగుల డెనిమ్ ఫ్యాంట్ .. కాంబినేషన్ గా చారల చొక్కాలో నభా సరికొత్తగా కనిపించింది. ఇక బటన్ లెస్ షర్ట్ లో నభా అందాల హిందోళం యూత్ లో కిక్కు పెంచింది. టూమచ్ గా చినిగిన బ్లూ జీన్స్ నభా పోష్ లుక్ ని ఎలివేట్ చేస్తోంది. చేతిలో కప్పు కాఫీతో అలా కురులను సరి చేసుకుంటూ కనిపించింది. వాస్తవానికి ముందు మీ కాఫీని తాగండి..!! అంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది.

నభా నటేష్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ విజయంలో నభా కీరోల్ గురించి తెలిసినదే. రామ్ పెర్ఫామెన్స్ కి ధీటుగా మాస్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేసింది. కోస్టార్ నిధి కంటే నభాకి ఎక్కువ మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఈ బ్యూటీ డిస్కోరాజా, అల్లుడు అదుర్స్, మాస్ట్రో, చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది.

అన్ని పెద్ద ప్రాజెక్ట్ లే. కానీ వైఫల్యాలు ఎదురయ్యాయి. ఇక ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఈ బ్యూటీ పారితోషికం భారీగా పెంచేసిందని గుసగుసలు వినిపించాయి. నభా తదుపరి సినిమాల గురించి అప్ డేట్ తెలియాల్సి ఉంది.



# పాలనాధికారం ఢిల్లీ ప్రభుత్వానిదే..

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పాలనా సర్వీసులపై నియంత్రణాధికారం ఎవరికి ఉండాలనే వివాదంలో అరవింద్ కేజ్రీవాల్ సర్కారుకు సుప్రీంకోర్టు లో భారీ విజయం లభించింది. ప్రభుత్వాధికారులపై ఎన్నికైన ప్రభుత్వానికే సర్వాధికారాలు ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ మేరకు ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం ఏకగ్రీవ తీర్పు వెలువరించింది. ఎన్నికైన ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) కట్టుబడి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. శాంతిభద్రతలు మినహా మిగతా అన్ని అంశాలపై ఢిల్లీ ప్రభుత్వానికే నియంత్రణ ఉండాలని తెలిపింది. "ప్రజాస్వామ్యం, ఫెడరల్ విధానాలు.. రాజ్యాంగ మూలస్వరూపంలోని భాగమే. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అసలైన అధికారాలు.. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉండాలి. పాలనా వ్యవహారాలపై నియంత్రణ కూడా వారిదే. ఎన్నికైన ప్రభుత్వం నిర్ణయాలకు ఎల్‌జీ కట్టుబడి ఉండాలి. అధికారులు మంత్రులకు నివేదించకపోతే.. వారి ఆదేశాలను పాటించకపోతే.. అప్పుడు సమగ్ర పాలనా విధానాలపై అది ప్రతికూల ప్రభావం చూపిస్తుంది" అని సుప్రీంకోర్టు తెలిపింది. "ఢిల్లీ.. దేశంలోని ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా ఉండదు. దేశ రాజధాని అయినందున దీనికి ప్రత్యేక స్వరూపం ఉంది. ఇక్కడ పబ్లిక్ ఆర్డర్, భూమి, పోలీసు వ్యవస్థపై కార్యనిర్వాహక అధికారాలు కేంద్రానికే ఉంటాయి. అయితే, ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఢిల్లీలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉంది. అందువల్ల పాలనా సర్వీసులపై అసలైన అధికారాలు ప్రజాప్రతినిధులతో కూడిన ప్రభుత్వానికే ఉంటాయి" అని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఢిల్లీలోని అన్ని పాలనా సర్వీసులపై కేంద్రానికే నియంత్రణ ఉంటుందంటూ 2015లో కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ సానుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2019 ఫిబ్రవరి 14న ఈ వివాదంపై భిన్నాభిప్రాయ తీర్పును వెలువరించింది. పాలనా సర్వీసులపై ఢిల్లీ ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు లేవని జస్టిస్ అశోక్ భూషణ్ చెప్పగా.. జస్టిస్ ఏకే సిక్రి దాన్ని వ్యతిరేకించారు. ఢిల్లీలోని పాలనాధికారుల నియంత్రణకు సంబంధించిన శాసన, కార్యనిర్వాహక అధికారం కేంద్రానిదా, ఆ రాష్ట్ర ప్రభుత్వానిదా అనే వివాదాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నట్లు గతేడాది మే 6న సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం నేడు తీర్పు వెలువరించింది. ఈ క్రమంలోనే జస్టిస్ అశోక్ భూషణ్ ఇచ్చిన తీర్పును విస్తృత ధర్మాసనం తోసిపుచ్చింది.

# రాష్ట్రంలో పాలన పడకేసింది



హైదరాబాద్: రాష్ట్రంలో పాలన పడకేసిందని.. కేసీఆర్ పక్కా రాజకీయాలకు పరిమితం అయ్యారని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేస్తున్నారన్నారు. వారిని అణిచి వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు ఇలాగే వ్యవహరిస్తే తెలంగాణ వచ్చేదా.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కూడా సీఎం అణిచివేస్తున్నారన్నారు. రైతు నష్టాలపై సమీక్ష చేసే సమయం కూడా ముఖ్యమంత్రి లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. అమ్మకు అన్నం పెట్టేవాడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తా అన్నట్టు కేసీఆర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇక్కడి రైతులను ఆదుకోని కేసీఆర్ అబ్కీబార్ కిసాన్ సర్కారు అంటూ దేశ రాజకీయాలకు వెళ్తా అంటున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు భరోసా ఇచ్చేందుకు అన్ని జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలను రాజకీయాలకు అతీతంగా ఖండించాలని... కేసీఆర్ ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలను ఉక్కు పాదంతో అణిచి వేయాలని అన్నారు. ఎగ్జిట్ పోల్స్ కంటే పీపుల్స్ పల్స్ నమ్ముతామని.. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందనే నమ్మకం ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# జేపీఎస్‌లను చర్చలకు పిలువలేదు..

## సోషల్ మీడియాలో ప్రచారాన్ని కొట్టిపారేసిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న సమ్మెను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంటనే విరమించుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జేపీఎస్‌లను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని జరుగుతున్న ప్రచారం నిజం కాదని చెప్పారు. అలాంటి ప్రచారాన్ని నమ్మొద్దని తెలిపారు. ప్రభుత్వం తరఫున తానుగానీ, మరెవరూ గానీ వారిని చర్చలకు పిలువలేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె విరమించి విధుల్లో చేరితే బాగుంటుందన్నారు. వారిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచిఅభిప్రాయం ఉందని, దానిని చెడగొట్టుకోవద్దని సూచించారు. ప్రభుత్వాన్ని శాసించాలని సాహసించడం, నియంత్రించాలని అనుకోవడం తప్పని వెల్లడించారు. వారు సమ్మెచేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. సంఘాలు కట్టబోమని, యూనియన్లలో చెరబోమని, సమ్మెలు చేసేదిలేదని, ఎలాంటి డిమాండ్లకు దిగమని ప్రభుత్వానికి బాండ్ రాసిచ్చారని, ఇప్పుడు ఆ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్న తీరు బాగాలేదన్నారు. పైగా



సోషల్‌మీడియాలో జరుగుతున్న వెంటనే ప్రచారాన్ని నిలిపివేయాలి సూచించారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# డిగ్రీలో ప్రవేశాలకు.. 'దోస్త్' షెడ్యూల్ విడుదల




డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యాశాఖ మండలి గురువారం విడుదల చేసింది. ఉతన్న విద్యాశాఖ మండలి చైర్మన్ లింబాద్రి షెడ్యూల్‌ను విడుదల చేశారు. మూడు విడుతల్లో డిగ్రీ ప్రవేశాల దోస్త్ ప్రక్రియ సాగుతుందన్నారు. ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు దోస్త్ రిజిస్ట్రేషన్లు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి జూన్ 11 వరకు వెబ్ ఆప్షన్‌లు ఇవ్వాలని, జూన్ 16న మొదటి విడతలో డిగ్రీ సీట్ల కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 16 నుంచి 26 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్ అవకాశం ఉంటుందన్నారు. 16 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందని, జూన్ 30న రెండో విడతలో సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. జూలై 1 నుంచి 5 వరకు మూడో విడత రిజిస్ట్రేషన్లు, ఒకటి నుంచి 6 వరకు వెబ్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని, జూలై 10న మూడో విడత సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. మొదటి విడతలో రూ.200 చెల్లించాలి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, రెండు, మూడో విడుతలో రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 17 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ వెల్లడించారు.

# గచ్చిబౌలి-కొండాపూర్ మార్గంలో 3 నెలలు ట్రాఫిక్ మళ్లింపు

రాయదుర్గం : గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డు వైపు శిల్పా లేవుట్ ఫేజ్ -2 పైవంతెన పనులు చేపడుతున్న నేపథ్యంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ మళ్లించనున్నట్లు సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాపిక్) నారాయణ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి ఆగస్టు 10 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

ఓఆర్ఆర్ వైపు నుంచి హఫీజ్ పేటకు శిల్పా లేఅవుట్ పై వంతెన నుంచి మీనాక్షి టవర్స్, డెలాయిట్, ఏఐజీ ఆసుపత్రి, క్యూమార్ట్, కొత్తగూడ పై వంతెన మీదుగా వెళ్లాలి. టెలికాంనగర్ నుంచి కొండాపూర్‌కు వచ్చేందుకు గచ్చిబౌలి పై వంతెన కింద యూటర్న్ తీసుకుని శిల్పాలేఅవుట్ పై వంతెన నుంచి మీనాక్షి టవర్స్, డెలాయిట్, ఏఐజీ ఆసుపత్రి, క్యూమార్ట్, కొత్తగూడ మార్గాన్ని అనుసరించాలి.లి లింగంపల్లి నుంచి కొండాపూర్ వైపునకు వచ్చేందుకు గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ నుంచి డీఎల్ఎఫ్, రాడిసన్ హోటల్, కొత్తగూడ మీదుగా మళ్లిస్తారు. నానక్‌రాంగూడ విప్రో జంక్షన్ నుంచి ఆల్విన్ చౌరస్తా వైపునకు వచ్చే వాహనదారులు ట్రిపుల్ ఐటీ కూడలి వద్ద ఎడమ వైపు వెళ్లి.. గచ్చిబౌలి స్టేడియం ముందు యూటర్న్ తీసుకుని డీఎల్ఎఫ్, రాడిసన్ హోటల్ మార్గంలో వెళ్లాలి. టోలిచౌకి నుంచి ఆల్విన్ చౌరస్తాకు వచ్చే వాహనాలను రాయదుర్గం బయోడైవర్సిటీ పార్కు కూడలి నుంచి మైండ్‌స్పేస్, సైబర్ టవర్స్, కొత్తగూడ జంక్షన్ మీదుగా మళ్లిస్తారు. ఆల్విన్ కాలనీ నుంచి లింగంపల్లికి వచ్చేందుకు బొటానికల్ గార్డెన్ జంక్షన్ మీదుగా మసీదు బండ, హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో రోడ్డును అనుసరించాలి.



# ఇమ్రాన్ సన్నిహితుడు అరెస్టు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ అరెస్టుతో ఆ దేశం భగ్గుమంటోంది. ఈ పరిస్థితుల్లో పీటీఐ పార్టీ నేతల అరెస్టులు ఆగడం లేదు. తాజాగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు, విదేశాంగశాఖ మాజీ మంత్రి షా మహ్మద్ ఖురేషీని అరెస్టు చేశారు. ఆయన ఇమ్రాన్ ఖాన్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయన్ను అదుపులోకి తీసుకున్న దృశ్యాలను పార్టీ ట్విటర్‌లో షేర్ చేసింది. సాధారణ దుస్తుల్లో వచ్చిన కొందరు ఖురేషీని తీసుకెళ్తున్నట్లు అందులో కనిపిస్తోంది. ఇస్లామాబాద్ పోలీసులు తమ నేతను అరెస్టు చేసి రహస్య ప్రాంతానికి తరలించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

అంతకుముందు ఇమ్రాన్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఫవాద్ చౌధురీ కూడా అరెస్టయ్యారు. ఈ అరెస్టుల నేపథ్యంలో తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలు పాక్ చరిత్రలో చీకటి అధ్యాయం అంటూ ఆర్మీ ఖండించింది. నిరసనకారులు ఆర్మీకి చెందిన ఆస్తులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని, వీటిని తాము ఏమాత్రం సహించబోమని హెచ్చరించింది. ఈ ఉద్రిక్తతల వల్ల ఎనిమిది మంది మరణించగా.. 1900 మందిని అరెస్టు చేశారు.

**పాక్‌లో అనిశ్చితి.. స్పందించిన రిషి సునాక్ –** పాకిస్థాన్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ స్పందించారు. ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు.. ఆ దేశ అంతర్గత వ్యవహారమని వ్యాఖ్యానించారు. అయితే అక్కడి పరిస్థితులను గమనిస్తున్నామని చెప్పారు.

**యూఎస్ మాజీ దౌత్యవేత్త సంచలన వ్యాఖ్యలు..** అఫ్గానిస్థాన్‌లో దౌత్యవేత్తగా పనిచేసిన జల్మే ఖలీల్జాద్.. ఇమ్రాన్ అరెస్టును ఖండించారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలన్నారు. కస్టడీలో ఇమ్రాన్‌ను హత్య చేస్తారనే భయాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇమ్రాన్ కూడా న్యాయమూర్తి ముందు ఇదే భయాన్ని వ్యక్తం చేశారు.



# డీజిల్ వాహనాలను నిషేధిస్తారా.?

కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ కమిటీ.. 2027నాటికి డీజిల్ వాహనాలను పూర్తిగా నిషేధించాలని ఇటీవల పేర్కొంది. వాటి స్థానంలో విద్యుత్, గ్యాస్, ఆధారిత వాహనాల ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఫిబ్రవరిలోనే కేంద్రానికి నివేదిక అందినప్పటికీ.. ఇప్పటికీ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నిజంగా డీజిల్ వాహనాలను నిషేధిస్తే భవిష్యత్‌లో ప్రజా, సరుకు రవాణా పరిస్థితి ఎలా ఉండబోతుంది? ప్రత్యామ్నాయాలపై ప్రజలకు ఎలాంటి అవగాహన అవసరం? ఎలక్ట్రిక్, గ్యాస్ వాహనాల వినియోగంలో సాధకబాధకాలు ఏమిటి?



# ఉద్ధవ్‌ను మళ్లీ సీఎంగా నియమించలేం

ఢిల్లీ: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రే ఊరటనిచ్చేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన్ను తిరిగి నియమించలేమని వ్యాఖ్యానించింది. ఆయన బలపరీక్షను ఎదుర్కోకుండా స్వచ్ఛందంగా రాజీనామా చేయడమే అందుకు కారణమని వెల్లడించింది. శివసేన పార్టీలో తలెత్తిన సంక్షోభంపై ఉద్ధవ్ ఠాక్రే వర్గం, శిండే వర్గం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సంక్షోభ సమయంలో గవర్నర్ వ్యవహరించిన తీరును తప్పుపట్టింది. 'ఉద్ధవ్ ఠాక్రే మెజార్టీ కోల్పోయారని నిర్ధారణకు వచ్చేందుకు గవర్నర్ వద్ద తగిన సమాచారం లేనప్పుడు.. సభలో మెజార్టీని నిరూపించుకోమని ప్రభుత్వాన్ని పిలవడం సబబు కాదు. గవర్నర్ విచక్షణాధికారాలను అమలు చేసిన తీరు చట్టపరంగా లేదు. అలాగే పార్టీలోని అంతర్గత వివాదాలను పరిష్కరించడానికి బలపరీక్షను ఒక మాధ్యమంగా వాడలేం. అయితే, ఉద్ధవ్‌ఠాక్రే బలపరీక్షను ఎదుర్కోకుండానే రాజీనామా చేడయంతో తిరిగి ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేం. ఠాక్రే రాజీనామా చేయడంతో.. అప్పటికే అతిపెద్ద పార్టీ అయిన భాజపా మద్దతున్న ఏక్‌నాథ్ శిండే వర్గంతో గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించడం సమర్థనీయమే 'అని వెల్లడించింది. శిండే, ఆయన వర్గ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తేలకుండానే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించిన నాటి గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ నిర్ణయాన్ని వాదనల్లో భాగంగా ఉద్ధవ్ వర్గం ప్రశ్నించింది. ఇప్పుడు ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలపై తాము అనర్హత




వేటు వేయలేమని సుప్రీం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం ఎదుర్కొంటున్న స్పీకర్‌కు.. రెబల్ ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసులు జారీ చేసే అధికారాలు ఉంటాయా లేదా అన్న అంశాన్ని మరింత అధ్యయనం చేయాల్సి ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అందుకే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నామని చెప్పింది.

**శిండే రాజీనామా చేయాలి: ఉద్ధవ్ –** 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి ఏక్‌నాథ్ శిండే అధికారంలోకి వచ్చారు. ఆయన కూడా రాజీనామా చేయాలి'అని ఉద్ధవ్ డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడుతూ సుప్రీం తీర్పుపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉద్ధవ్ వెంట బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా ఉన్నారు.

**ఇది మా నైతిక విజయం: సంజయ్ రౌత్ –** ప్రస్తుత మహారాష్ట్ర ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ఏర్పడిందని సుప్రీంకోర్టు నిర్ణయం చెబుతోందని ఉద్ధవ్ వర్గం శివసేన నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. ఇది తమకు నైతిక విజయమని అన్నారు.

# దారుణం.. కుమార్తెను గొడ్డలితో నరికి చంపిన తండ్రి



మంథని: తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మంథని మండలం బత్తుపల్లిలో సదయ్య అనే వ్యక్తి తన కుమార్తె రజిత (10)ను గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కుమార్తెను చంపేసిన తర్వాత గ్రామంలోని మరో వ్యక్తిపైనా సదయ్య దాడి చేశాడు. అయితే, గత కొంతకాలంగా ఆయన మానసిక స్థితి సరిగా లేకపోవడంతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com